THE LARGEST CIRCULATED TELUGU EDUCATIONAL MONTHLY

ఐక్య ఉపాధ్యాయ

ఏప్రిల్ - 1999

రూ. 5/-

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక



విజన్ 2020 - వేస్తుందది అప్పుల వల
స్వర్ణాంధ్రప్రదేశ్ - అవుతుందది అందమైన కల

పాఠకుల అభిప్రాయాలు

99 ఫిబ్రవరి సంచికలోని "అద్దంలో చందమామ - విజన్ 2020" అను వ్యాసం, మార్చి సంచికలోని "వ్యవస్థలు మారినా అవస్థలు తొలగని అతివలు" అను వ్యాసం చాలా విజ్ఞానదాయకంగా' వున్నాయి. ఈ రెండు వ్యాసాల రచయిత జె. సచేంద్రబాబు గారికి అభినందనలు.

- జి.వి. నాగమల్లేశ్వరరావు, చింతూరు.

ఫిబ్రవరి సంచికలో ప్రచురించిన "హాస్యం పరమౌషదం" సోదాహరణాలతో హాస్యం అవసరాన్ని తెలియజేసింది. మన పత్రికలో కూడా ప్రతి నెల జోక్స్ వేస్తే బాగుంటుందేమో ఆలోచించండి.

- యం. శ్రీహరి, తిరువూరు

మన పత్రికలోని ప్రశ్నోత్తరాల శీర్షిక ద్వారా ఎన్నో సందేహాలు నివృత్తి అవుతున్నాయి. ఇటీవల ఆ శీర్షిక లేకపోవడం నిరాశ కలిగిస్తోంది. ఎట్టి పరిస్థితులలోను ప్రశ్నోత్తరాల శీర్షికను మిస్ చేయవద్దని మనవి.

- యం. శ్రీనివాసశర్మ, కురబలికోట

మన పత్రికకు గుండెకాయ వంటి ప్రశ్నోత్తరాల శీర్షికను రెండు సార్లు మిస్ చేశారు. మన పత్రికకు ప్రశ్నోత్తరాలు, నియమ నిబంధనల శీర్షికలు హైలెట్‌గా వుంటాయి. వాటిని రెగ్యులర్‌గా ప్రచురించండి.

- వి. వెంకటేశ్వరరావు, చల్లపల్లి

99 మార్చి సంచికలోని "మిడిల్ క్లాస్ మేష్టారు" మినీ కథ సందేశాత్మకంగా వున్నది. "వృద్ధులు వ్యర్థులు కారు - వృద్ధాప్యం శాపము కాదు" వ్యాసంలో శ్రీనివాసులు గారు మంచి విషయాలను చక్కగా వివరించారు.

- కె. గోపయ్య, సఖినేటిపల్లి

నడుస్తున్న చరిత్ర శీర్షికన "ప్రపంచీకరణ వలన పెను ప్రమాదం' ' అనే వ్యాసంలో, ఆర్థికవేత్తలు వెలుబుచ్చిన విలువైన అభిప్రాయాలు పొందుపరచి, మమ్ములను విజ్ఞానవంతులను చేసిన జస్టిస్ బి.పి. జీవన్ రెడ్డి గార్కి అభినందనలు.

- 1) కె. సుభాషిణి దేవి, మండపేట;

2) వి.పి.వి.వి. సత్యనారాయణ, నర్సిపూడి

మార్చి సంచికలోని వార్తా ప్రపంచం శీర్షికలో "పాలపుంతలో మరో అద్భుతం" మమ్ములను ఎంతగానో ఆలోచింపచేసినది.

- యన్. నాగేశ్వరరావు, జంబూపట్నం

99 మార్చి సంచికలో 'మనం - మన ఆరోగ్యం' శీర్షికన 'రియాక్షన్'లో డా॥ బ్రహ్మారెడ్డి గారు హాస్యం జోడించి ఇచ్చిన సూచనలు ఉపయుక్తంగా వున్నాయి.

- ఎ.వి. సోమయాజులు, ములగపూడి

"చైతన్య స్రవంతి" శీర్షికన ప్రచురిస్తున్న వ్యాసాలు బాగుంటున్నాయి. 99 మార్చి సంచికలోని "వందేమాతరం" ఎంత లౌకికం? లో పల్లవి మరియు చరణాల యొక్క భావము తెలియజేయుట సమయోచితంగా వున్నది.

- బత్తిన చంద్రయ్య, వరంగల్

సంపాదక లేఖలు

హాఫ్ ఎ మిలియన్ ఉద్యోగుల సమస్యలు

ఆర్యా !

1973వ సంవత్సరములో కేంద్ర ప్రభుత్వం విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం అర్థ మిలియన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఉద్దేశం ప్రకారం 5 లక్షల ఉద్యోగాల కల్పన వివిద శాఖల్లో జరిగింది. ముఖ్యంగా మన విద్యాశాఖలో జి.ఓ.యం.యస్. నెం. 620 ఎడ్యు, తేది 7-7-1973 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 3,000 మంది బియిడిలను నెలకు రూ. 175/-లపైన, 1000 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లనూ నెలకు రూ. 125/-ల స్టైఫండు మీద నియమించారు.

ఇలా నియమించబడిన వారిని నియామక తేదీ నుండి 1 సంవత్సరం తరువాత గాని, ఆ లోపున గాని పదవీ విరమణ ఖాళీలలో గాని, నూతనంగా ఏర్పడే ఖాళీలలో గాని ఎబ్జార్బు చేస్తామని జి.ఓ.లో స్పష్టముగా పేర్కొనుట జరిగినది. సదరు నియమకాలు 1973 సంవత్సరములో జిల్లా సెలక్షను కమిటీలచే సెలక్టు కాబడిన వారితో జరిగాయి.

ప్రభుత్వం వివిధ సర్క్యులర్లలో బియిడి వారిని బియిడి పోస్టులలోనే అబ్జార్బు చెయ్యాలని, సెకండరీ పోస్టుకు నియమించబడిన వారిని సెకండరీ పోస్టులలోనూ అబ్జార్బు చెయ్యాలని స్పష్టమైన ఆదేశాలు యిచ్చింది. దీనికి భిన్నంగా కొన్ని జిల్లా పరిషత్తుల వారు బియిడిలను సెకండరీ పోస్టులలోనికి మార్చారు. ఇది ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధం. 1974-75 సంవత్సరాలలో సెకండరీ గ్రేడు పోస్టులలో నియమింపబడిన వారిని, సెకండరీ గ్రేడు పోస్టులలో పని చేస్తూ ఆప్‌గ్రేడ్ అయిన వారిని అందరికి 1-1-76 నుండి బి.యిడిగా సర్వీసు క్రమబద్ధీకరణ చేయుట వలన 1973లోనే బియిడిగా ఎంపిక జరిగి స్టైఫండరీ బి.యిడి గా నియామకం పొందిన వారికి అన్యాయం జరుగుతోంది.

ఇటీవల ఉపాధ్యాయ సంఘాలకు, ప్రభుత్వానికి మధ్య కుదిరిన ఒప్పందంలో 8, 15 సంవత్సరాల స్కేలుకు వారి సర్వీసును 1973 నుండి లెక్కించిడాని ప్రభుత్వం ఒప్పుకుందని తెలిసింది. మానవతా దృష్టితో ఉత్తర్వులు ఇప్పించాలని కొరుతున్నాను.

ఇట్లు

ఎన్.వి.యస్. సాంబశివరావు

జంగారెడ్డిగూడెం

విజ్ఞప్తి

ప్రాథమిక, సెకండరీ తరగతులకు చెందిన వివిధ పాఠ్యాంశములను బోధించుటలో ఉపాధ్యాయులు తమ "ప్రయోగాలు - అనుభవాలు" ను పంపిచాలని విజ్ఞప్తి. అర్హమైన వాటిని "అకడమిక్ సెల్" శీర్షిక క్రింద ప్రచురించగలము.

- సంపాదకుడు

IUVO1A374

IKYA UPADHYAYA

YEARLY SUBSCRIPTION 50-00

SINGLE COPY 5-00

IKYA UPADHYAYA
Palparthivari Street,
Vijayawada - 520 002.

Phones : VIJ 573763, HYD 7636840

ఐక్య ఉపాధ్యాయ

సంపాదక వర్గము

కొండవీటి జోజయ్య
ప్రధాన సంపాదకులు
అప్పారి వెంకటస్వామి
దాచూరి రామిరెడ్డి
పి. మాణిక్ రెడ్డి
యం. సంయుక్త

సంపుటి - 25 ఏప్రిల్ - 1999 సంచిక - 4

పే కమిటీ రిపోర్టు వాయిదాను వ్యతిరేకించండి

కేంద్ర ప్రభుత్వం 5వ పే కమిటీ సిఫార్సులను ప్రభుత్వం సవరించిన రూపంలో 1996 జనవరి నుండి అమలు జరిపింది కేంద్ర ప్రభుత్వం పే కమిటీ సిఫార్సులు యధాతదంగా అమలు జరుపాలని ప్రయత్నిస్తే ఉద్యోగులు పోరాడి వాటిని తమకు అనుకూలంగా మార్పులు చేయించుకొని, అమలు జరిపించుకున్నారు జీతము, కరువు భత్యము, రెండు తాత్కాలిక సహాయము కలిపి 40 శాతం వేయిటేజితో సాధించుకున్నారు నాడు నేషనల్ ఫ్రంటు అధికారంలో వుండటం, వామపక్షాలు ఉద్యోగులకు అండగా వుండటం వల్ల అదిసాధ్యపడింది.

తర్వాత చాల రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పే కమిటీలు వేయుట, తాత్కాలిక సహాయాలు (ఐ ఆర్) ప్రకటించుట కేంద్ర ప్రభుత్వం అమలు జరిపిన విధంగా ఉద్యోగుల వేతనాలు అమలు జరుపుట, చేశాయి. అయినా మన రాష్ట్ర ప్రభుత్వం అటువంటి చర్యలు చేపట్టలేదు.

అందుచేత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పోరాట సమితి (జె ఎ సి) దశల వారి పోరాటం చేపట్టి, చివరకు సమ్మెకు కూడా పిలుపుయిస్తే ప్రభుత్వం దిగివచ్చి కొన్ని తక్షణ సమస్యలు పరిష్కరించి, పే కమిటీని వేయుటకు 4-12-98న అగ్రిమెంటు యిచ్చింది.

సదరు అగ్రిమెంటు ప్రకారం పే కమిటీని నియమిస్తూ, వారు చేయవలసిన పనులు నిర్దేశిస్తూ 25-12-97న జి ఓ 565 విడుదల చేసింది తర్వాత జి ఓ 39 ద్వారా 31-1-98న పే కమిషనరుగా శ్రీ ఆర్. కె ఆర్ గోనేల గారిని నియమిస్తూ వారు చార్జి తీసుకున్న ఏడాదిలోగా పే కమటీ నివేదిక యివ్వాలని ఆదేశించింది

1996లోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు పెరగడం, మన పే కమిటీ నియామకంలో ఆలస్యం జరగడం, కేంద్ర రాష్ట్ర ఉద్యోగుల వేతనాలలో విపరీత వ్యత్యాసం వుండటం కారణంగా వెంటనే తాత్కాలిక సహాయం పెంచాలని జె ఎ సి ఆందోళనకు పిలుపు యివ్వగా ప్రభుత్వంతో జరిగిన చర్చలలో 30 శాతమునకు గాను, 11 శాతం జూన్ 98 నుండి పెంచుతూ జి ఓ. 117 తేది 3-7-98న ఉత్తర్వు యిచ్చింది.

తాత్కాలిక సహాయం యిచ్చి 9 మాసాలు గడచి పోయినా ముఖ్యమంత్రి హామీ యిచ్చిన ప్రకారం మరొకసారి తాత్కాలిక సహాయం యిప్పటి వరకు పెంచలేదు

1998 డిశంబరులో రావలసిన నివేదిక 1999 ప్రవేశించి మూడు నెలలు గడిచినా వెలుగుచూడలేదు. అసెంబ్లీకి ఎన్నికలు డిశంబరు లోపల జరుగనున్నాయి. పే కమిటీకి సమయం సెప్టెంబరు వరకు పొడిగించటమంటే పే కమిటీ నివేదిక కావాలని ప్రభుత్వం ఎన్నికలయి పోయేవరకు వాయిదా వేయాలనే ఆలోచనలో వున్నట్లు భావించాలి. కావాలనే ప్రభుత్వం నివేదిక యిచ్చే వ్యవధి పొడగించింది ఇది ఉద్యోగులను వంచించడమే అవుతుంది.

ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు తలొగ్గిన ప్రభుత్వం, ఉద్యోగుల మీద దాడికి సిద్ధపడింది. ద్రవ్యలోటు తగ్గించే సాకుతో ఉద్యోగుల జీతాల మీద, ప్రజలకు యిచ్చే సబ్సిడీల మీద ఖర్చు తగ్గించాలని నిర్ణయించింది. 19 శాతం ఉద్యోగులకు తగ్గించేదానికి ఈ కాలంలో పదవీ విరమణ చేసే 2.1 శాతం మంది ఖాళీలు నింపకుండా వుంచేదానికి, వీరుగాక మరొక 76,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేదానికి నడుం కట్టింది.

ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఇప్పటికే 3 శాతం మందిని ఉద్యోగాల నుండి తొలగించారు అందువల్ల రాష్ట్ర స్థూల ఆదాయంలో జీతాల ఖర్చు 62 శాతం నుండి 53 శాతానికి తగ్గింది అక్కడితో ఆగకుండా దానిని 5 శాతానికి తగ్గిస్తానని ప్రపంచ బ్యాంకుకు మన ప్రభుత్వం హామీ యిచ్చింది.

జీతాలు పెంచరాదని, పెంచవలసి వచ్చినా, కేంద్ర ప్రభుత్వ పద్ధతిలో కాకుండా 20 శాతంలోపే వుండాలని, దానిని వాయిదాల పద్ధతిలో చెల్లించాలని, కరువు భత్యాలయితే పెంచిన దానిలో కొంత శాతం శ్వాశతంగా ప్రభుత్వ ఖజానాలో వుండాలని, ప్రపంచ బ్యాంకు షరతులు వున్నాయి. ఇవన్నీ లేకుండా అసలు పే కమిటీ రిపోర్టులే కొంత కాలం వాయిదా వేయాలనేది కూడా అందులో వుంది.

ఒక వైపు ప్రభుత్వ శాఖల ప్రయివేటీకరణకు ప్రయత్నించి ఉద్యోగుల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా ప్రభుత్వం వెనుకడుగువేసింది. విద్యా రంగంలో అప్రంటిస్ విధానం అమలు జరుపుతున్నది మరొక వైపు విద్యా వాలంటీర్లంటూ ప్రయివేటీకరణకు పూనుకున్నది వారికి ప్రపంచ బ్యాంకు చెప్పినట్లు పెన్షను సౌకర్యాలు లేకుండా చేసింది.

ఇలా కొత్త సౌకర్యాలు యివ్వకుండా పాత సౌకర్యాలు ఎగరగొట్టటంతో రాష్ట్రాన్ని తిరోగమన విధానంలోనికి తీసుకెళ్ళే దానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది

తిరిగి పది లక్షల మంది ఉద్యోగులు పోరుబాటలో పయనిస్తే తప్ప ప్రభుత్వ ప్రయత్నాన్ని వెనుకడుగు వేయించలేము అందుకు మరొకసారి మనం నడుం బిగించాలి ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక వైఖరిని ఎండగట్టాలి పే కమిటీ రిపోర్టు కేంద్ర పద్ధతిలో మే నెలలోగా సాధించుకోవాలి దానిని ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా అమలు జరిపించుకోవాలి

అందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రానున్న ప్రమాదాన్ని గుర్తించి, ఒక్క త్రాటిపైనించి, పే కమిటీ రిపోర్టు వెంటనే వెలువడేలా పోరాటానికి సమాయత్తం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

వార్తా ప్రపంచం

మధురాంతకం రాజారాం మృతి

ప్రముఖ కథా రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ మధురాంతకం రాజారాం 1-4-99న మరణించారు. ఆయన మరణంతో సాహితీ లోకంలో విషాదఛాయలు అలముకున్నాయి. 1930 అక్టోబరు 5న జన్మించిన రాజారాం 1952వ సం॥లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. ఆయన 1957వ సం॥లో రచనా ప్రవృత్తికి శ్రీకారం చుట్టారు. కథలు, నవలలు, నాటికలు, అనువాద రచనలు ద్వారా తెలుగు లోగిళ్ళను పలుకరించారు. 10 సం॥ క్రిందట ఆయన ఉపాధ్యాయుడుగా రిటైరయ్యారు.

మార్చి 31న జరిగిన ఒక సాహిత్య సమావేశంలో ఆవేశంగా అధ్యక్షపన్యాసం చేశారు. ఆయన ఆరోగ్యరీత్య ఉపన్యాసాన్ని ఆపాలని కోరినప్పుడు, "నాకింకా అవకాశం వస్తుందో రాదో! నన్ను మాట్టాడనివ్వండి. జీవితం గురించి నేనింకా చెప్పాలి ?" అన్నారు. సాహిత్య వేదిక నుండి ఆవే ఆయన చివరి మాటలు.

ఇన్‌శాట్ - 2ఇ ప్రయోగం సక్సెస్

ఇన్‌శాట్-2ఇ ఉపగ్రహం శనివారం విజయవంతంగా ప్రయోగించబడింది. రు. 220 కోట్ల వ్యయంతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నిర్మించిన ఇన్‌శాట్-2ఇ ని ఐరోపాకు చెందిన 42-పి ఏరియన్ రాకెట్ 2వ తేది తెల్లవారుఝామున 3-33 ని॥లకు ఎలాంటి లోపాలు లేకుండా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. దీనికి 12 సం॥ పనిచేసే సామర్థ్యం వున్నది.

ఫ్రెంచి గయానాలోని "కౌరో" ఉపగ్రహ ప్రయోగ క్షేత్రం నుండి ప్రయోగించిన 6 ని॥కే బెంగుళూరుకు సమీపంలోని హసన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇన్‌శాట్-2ఇ ఉపగ్రహం నుండి సిగ్నల్స్‌ను అందుకోవడం ఆరంభించింది.

ఇన్‌వాట్-2ఇ ప్రయోగంతో టెలివిజన్ ప్రసారాల్లోను, టెలికమ్యూనికేషన్స్‌లోను వాతావరణ పరిశోధనలోను భారతదేశం ఒక మెట్టు పైకెగిరింది.

కుల వివక్షత నిర్మూలనకై కమీషన్

మన రాష్ట్రంలో దళితుల పట్ల, యితర వెనుకబడిన వర్గాలపట్ల చూపుతున్న కుల వివక్షత నిర్మూలనకు అవసరమైన చర్యలు సిఫార్సులు చేయడానికి వీలుగా రాష్ట్రంలో తాత్కాలిక కమీషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మార్చి 22న శాసన సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు.

"కుల వివక్షత లేని సమాజం కోసం, దళితులపై అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం, అందరం కలసి కృషి చేస్తామని", మార్చి 23వ తేదీన ఆం॥ప్ర॥ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కుల వివక్షత అధికంగా గల 9 జిల్లాలలో ప్రత్యేక సెషన్స్ కోర్టులు ఏర్పాటు చేస్తామని; 11వ జన్మభూమిలో కులవివక్షతా నిర్మూలన అంశాన్ని చేపట్టి ప్రత్యేకంగా ప్రచారం చేస్తామని ఆయన తెలియజేశారు. ఆ సందర్భంగా రాష్ట్ర శాసనసభలో జరిగిన చర్చకు స్పందించి ముఖ్యమంత్రిపై ప్రకటన చేశారు.

స్పీకర్ చేతికి శాసనసభ్యుల ఆస్తుల వివరాలు

శాసనసభ్యుల ప్రవర్తనా నియమావాళి ప్రకారం, ఆస్తుల ప్రకటన చేయడానికి మార్చి 31 చివరి రోజుగావడంతో, ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, స్పీకర్ శ్రీ యనమల రామకృష్ణుడిని కలిసి తమ ఆస్తుల వివరాలున్న కవర్లను అందజేశారు. స్పీకరు కూడా తన ఆస్థి వివరాలు వున్న కవరును డిప్యూటీ స్పీకర్ ఫరూఖ్‌కు అందజేశారు. కొద్ది మంది మంత్రులు, శాసనసభ్యులు మాత్రం మరికొంత వ్యవధి కావాలని కోరారు.

ఆస్తుల వివరాలను పరిశీలిస్తే గత 20 యేళ్ళ నుండి పూర్తి కాలం రాజకీయాలలో గడుపుతున్న ముఖ్యమంత్రి తదితరులకు యిన్ని కోట్ల ఆస్థి ఎలా సమకూరిందని ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు.

15 వేల టీచర్ పోస్టులకు త్వరలో నియామకాలు

రాష్ట్రంలోని జిల్లాపరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో 15,456 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తించారు. ఏప్రిల్ 2వ వారంలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, మే లో పరీక్ష నిర్వహిస్తారు. 15, 456 పోస్టుల్లో సుమారు 800 దాకా పోస్టులు ఐదు మార్కుల తగ్గింపుతో కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో టీచర్లను నియమించినందున డి.ఎస్.సి. 99లో ఆ పోస్టులను మినహాయిస్తున్నారు. అక్టోబరు 31 నాటికి ఖాళీలను గుర్తించి టీచర్ పోస్టుల వివరాలు సేకరించారు. జిల్లాల వారీగా టీచర్ పోస్టుల ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం 900, విజయనగరం 379, విశాఖపట్నం 818, తూర్పు గోదావరి 546, పశ్చిమ గోదావరి 350, కృష్ణా 427, గుంటూరు 443, ప్రకాశం 293, నెల్లూరు 357, చిత్తూరు 1126, కడప 310, అనంతపురం 1242, కర్నూలు 358, మహబూబ్‌నగర్ 981, రంగారెడ్డి 1295, హైదరాబాద్ 177, మెదక్ 1225, నిజామాబాద్ 596, ఆదిలాబాద్ 763, కరీంనగర్ 844, వరంగల్ 636, ఖమ్మం 431, నల్గొండ 959 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సవరించిన టెలిఫోన్ ఛార్జీలు

భారత టెలికాం రెగ్యులేటరీ అథారిటీ (ట్రాయ్) ప్రతిపాదించిన కొత్త టెలిఫోన్ ఛార్జీలు ఏప్రియల్ 1 నుండి కాకుండా ఏప్రిల్ 15 నుండి అమలు పరచవలసినదిగా కేంద్ర ప్రభుత్వం కోరింది.

కొత్త టారిఫ్ ప్రకారం గ్రామీణ ప్రాంతంలో అందరికి, పట్టణ ప్రాంతాల్లో నెలకు 200 కాల్స్ వరకు చేసే వారికి టెలిఫోన్ అద్దె, కాల్ ఛార్జీలు, ఫ్రీ కాల్స్ సంఖ్య యధాతధంగా వుంటాయి. పట్టణ ప్రాంతాలలో నెలకు 200 కాల్స్ మించి చేసే వినియోగదారులకు టెలిఫోన్ అద్దె, కాల్ ఛార్జీలు పెరుగుతాయి.

కొత్త చార్జీలు

పట్టణ ప్రాంతాల్లో 2 నెలలకు 400 కాల్స్ మించి చేసేవారికి

టెలిఫోన్ అద్దె

ప్రస్తుతం రూ.	ఇకపై రూ.
100	140
150	240
200	240
275	360
360	500
380	500

కాల్ ఛార్జీలు	ప్రస్తుతం	ఇకపై
ఫ్రీ కాల్స్	150	150
రూ. 0.80	151-500	151-400
రూ. 1.00	501-1000	401-1000
రూ. 1.20	-	1001 - ఆపైన
రూ. 1.25	1001-2000	-
రూ. 1.40	2001-ఆపైన	

గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు నెలలకు 400 కాల్స్‌లోపు చేసే వినియోగదారులకు టెలిఫోన్ అద్దె, కాల్ ఛార్జీలు యథాతథం.

ఉత్తర భారతంలో తీవ్ర భూకంపం

28-3-99న ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో రాత్రి 12-40 ని॥లకు భూమి కంపించినది. ఇది రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదయినది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక ప్రాంతాలు బాగా దెబ్బతిన్నవి. డెహ్రాడూన్‌కు 200 కి.మీ. దూరంలో కోమౌన్ కొండల వద్ద భూకంపం కేంద్రంగా అధికారులు గుర్తించారు.

అప్పుల బాటలో ప్రభుత్వ విధానాలు - కుప్పకూలనున్న ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ మేల్కొనండి - పోరాడండి!

ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులకు యు.టి.యఫ్. విజ్ఞప్తి

సోదర సోదరీమణులారా !

మన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణ ప్రాజెక్టు వివరాలు ప్రతిపక్షాల వత్తిడికి తలవొగ్గి మార్చిలో అసెంబ్లీలో బయటపెట్టింది. ఆ నివేదిక పరిశీలిస్తే భయంకర సత్యాలు బయటపడ్డాయి. వారి షరతుల ప్రకారము 1) ప్రాథమిక విద్య, 2) ప్రాథమిక ఆరోగ్యము, 3) నీటిపారుదల, 4) పోషకాహారం, 4) రోడ్లు, 5) ప్రభుత్వ రంగ సంస్థల పునర్నిర్మాణం కొరకు అప్పు యిచ్చారు. ఈ అప్పు తీసుకొన్నందుకు మన ప్రభుత్వం అనేక కఠిన షరతులు అమలు పరచాలి. ప్రభుత్వం ప్రతి పని ప్రపంచ బ్యాంకు అధికార్ల కనుసన్నలతో చెయ్యాలి.

ప్రపంచ పెట్టుబడిదారి దేశాలు ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా తమ దేశాలలో కుప్పతెప్పలుగా ఉత్పత్తి అగుచున్న వినియోగ వస్తువులు ఎక్కువగా కొనాలంటే ప్రతి ఒక్కరికి కనీస విద్య అవసరమని గుర్తించి, ప్రపంచ వ్యాపితంగా "అందరికి విద్య" 2000 సంవత్సరం నాటికి చెప్పే పథకాలకు విరివిగా ధన సహాయం అందించాలని 1993లో తీర్మానించారు. దాని ప్రకారం మన రాష్ట్రంలో 2003 సంవత్సరము నాటికి "అందరికి విద్య" అనే పథకం క్రింద డి.పి.ఇ.పి. ప్రాజెక్టుకు 504 కోట్లు అప్పు యిచ్చారు. అంతకు ముదు ఒ.డి.ఎ. వారు డి.పి.ఇ.పి. పేజీ-1 పథకానికి 200 కోట్లు గ్రాంటు యిచ్చారు. అలాగే 1986 నుండి 1999 వరకు కేంద్ర ప్రభుత్వం దాదాపు 50 వేల పోస్టులు మంజూరు చేసింది. అందుచే విద్యారంగంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు గణనీయంగా పెరిగాయి. ఇది మనలో ఉద్యోగాలు పెరుగుతున్నాయి అనే భ్రమలు కలిగిస్తుంది.

కాని ప్రపంచ బ్యాంకు షరతుల ప్రకారం అన్ని డిపార్టుమెంట్లలో 1.9 శాతం ఉద్యోగాలు ప్రతి సంవత్సరం తగ్గించాలి. విద్యా రంగంలో కూడా 2003 తర్వాత ప్రభుత్వ భారాన్ని ప్రజలపైకి నెమ్మది నెమ్మదిగా నెట్టివేయడానికి పాఠశాల కమిటీలు ఏర్పరిచారు. వాటికి పాఠశాల యాజమాన్యం పూర్తిగా ఒప్పగించే ప్రయత్నం జరుగుతుంది. భవిష్యత్తులో ఉపాధ్యాయుని నియామాకాలు ఎలా ఉంటాయో ప్రజలు తెలుసుకొని మానసికంగా తయారు చేయడానికి ప్యారా టీచర్ల నియామకం ప్రారంభమయింది. 2003 సం॥ తర్వాత దాదాపు అన్ని ఉపాధ్యాయ పోస్టుల నియామకం ఈ బాటలోనే జరుగుతుంది.

సెకండరీ విద్య నిర్లక్ష్యం చేయడం ప్రారంభమయింది. అలాగే మన జీతాలపై ఖర్చు ఎంత శాతం ఎప్పుడు పెంచాలో ఎప్పుడు తగ్గించాలో ? కూడ జంత్రి వేసినట్లు పేర్కొన్నారు.

పే కమిటీ సిఫారసులు ఎప్పుడు వస్తాయా ! అందులో ఏమి ఉంటుందా ? అని మనం ఆతురతతో ఎదురుచూస్తున్నాం, కాని ఎలా ఉండాలో వారు ముందే నిర్ణయించారు. 1998 జనవరి నుండి అమలు జరుపాలని, ఆరియర్సు 1999 నుండి చేల్లించాలని, పే కమిటీ రిపోర్టు 1999 నవంబరు ఎన్నికల ముందు ప్రకటించాలని, పే కమిటీ సిఫారసుల వల్ల జీతాల పెరుగుదల కేంద్రంతో దగ్గర దగ్గరగా పెంచినా ఆదనపు భారం 20 శాతం మించరాదని, వి.ఆర్.సి. నివేదిక అమలు జరిపేటప్పుడు ఉద్యోగ సంఘాలతో బేరసారాలు చేసి, వీలైనంత ఆదనపు భారం పడకుండా చూడాలని, పడిన ఆ భారం ఒకేసారి పడకుండా చూడాలని స్పష్టంగా పేర్కొన్నారు. యిందుకు గాను ఆరియర్లు అనేక విధాలుగా వాయిదా వేయవచ్చు.

దీనితోపాటు పబ్లిక్ సెక్టారు రంగాలలో వాలంటరీ రిటైరుమెంటు పథకం అమలు జరిపి, వాటిని మూసివేయాలని కూడ చెప్పబడింది. పెన్షన్ విధానంలో కూడ సంస్కరణలు చేసి ఆ భారాన్ని కూడ తగ్గించాలని పేర్కొన్నారు.

ఈ షరతులకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు చెలరేగకుండా, విద్యా, ఆరోగ్య పథకాలపై పెట్టే డబ్బు ప్రజలను చల్లబరుస్తుందని కూడ పేర్కొన్నారు.

ఈ డాక్యుమెంటు పరిశీలిస్తే మన ప్రభుత్వ ప్రతి కదలిక వారికనుసన్నలలో ఉంటుంది. బడ్జెటు కూడ వారి నేతృత్వంలో తయారు ఆవుతుంది. ప్రభుత్వ నిర్వహణలో వచ్చే అన్ని సంస్కరణలు వారి సూచనలు మేరకు జరుగుతున్నాయి. ఇంత పరాధీనత మనమెన్నడు చూడలేదు. విద్యా రంగంలో గత 3 సం॥లలో ప్రవేశ పెట్టబడిన నూతన ధోరణుల రహస్యం దీనితో నగ్నంగా యిప్పుడు బయటపడింది.

1. ప్రయివేటీకరణ బాటలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో సొసైటీలకు అప్పగించడం.
2. గ్రామ విద్యా కమీటీలకే పాఠశాలల పర్యవేక్షణ పూర్తిగా అప్పగించే ప్రయత్నం (మన వత్తిడి వల్ల, తాత్కాలికంగా కొంత వెనుకడుగు వేశారు).
3. రెగ్యులర్ టీచర్లకు బదులు అప్రెంటిస్ టీచర్లు, ప్యారాటీచర్లను నియమించడం (ఖర్చు తగ్గించడానికి)
4. రీ డిప్లాయిమెంటు పేరుతో రేషనలైజేషన్ అమలు జరుపడం.
5. ఉన్నత పాఠశాలలకు 1985 నుండి ఆదనంగా గ్రాంటు-ఇన్-ఎయిడ్ పోస్టులు మంజూరు చేయకపోవడం.
6. గత 10 సంవత్సరాలుగా డ్రాయింగు, క్రాఫ్టు , పోస్టులు నింపకపోవడం (డబ్బు పొదుపు)
7. వృత్తి విద్యా బోధకులను రెగ్యులర్ స్కేలు యివ్వక పోవడం.

వారి సూచనల మేరకు అనేక విధాలైనా సబ్సిడీలు రద్దు చేయడం, నీటి తీరువా రేట్లు పెంచడం, ప్రజలకే బాధ్యత అనే పేరుతో నీటిపారుదల మరమత్తుల బాధ్యత ప్రజలపై నెట్టడం, ఆస్పత్రులలో ఫీజులు వసూలు చేయడం, కళాశాలలో విద్యా ఖర్చు ఫీజుల రూపంతో వసూలు చేయడం జరుగుతుంది.

ఈ అప్పుల భారం పర్యవసానం ఎలా ఉంటుందో కూడ తెలుసుకోవాలి. 1998-99 నాటికి మన అప్పు 32 వేల కోట్లుంటుంది. ప్రతి బిడ్డపై అప్పు దాదాపు 5,000 ఉంటుంది. ప్రపంచ బ్యాంకు వద్ద తీసికొన్న 1900 కోట్ల ఋణాలు ఈనాడు నిర్ణయించిన డాలర్లలో 2004 నుండి 2018 వరకు 6 నెలల వాయిదాలలో చెల్లించాలి.

ఆనాటి డాలరు మారకపు విలువలను బట్టి అప్పు తడిసి మోపెడవుతుంది. ప్రభుత్వం యొక్క ఈ దుష్ట విధానలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు సంఘటితంగా పోరాడడమే గాక, చదువుకున్న వర్గంగా ప్రజలకు వాస్తవాలు చెప్పి, చైతన్యపరాచాల్సిన బాధ్యత మనపై ఉంది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే అన్ని పోరాటాలలో భుజం భుజం కలిపి పాల్గొనాలని యు.టి.యఫ్. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, కార్మికులకు విజ్ఞప్తి చేస్తోంది.

ముఖ్యంగా పే కమిటి నివేదిక వెంటనే ప్రకటించడానికి, కేంద్ర వేతనాలతో సమానంగా వేతనాలు పెంచడానికి, ఆరియర్సు రొఖ్ఖంగా పొందడానికి, పి.ఆర్.సి. సిఫారసులు అమలు జరుపడానికి సమిష్టి ఉద్యమం చేపట్టాలని అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేస్తుంది.

ఇట్లు

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

హైదరాబాదు
తేది : 9-4-1999

వ్యాయామ దర్శిని సిద్ధం

వ్యాయామ కళాశాల విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయులు పది మాసాలుగా ఎదురుచూస్తున్న వ్యాయామదర్శిని పుస్తకాలు సిద్ధంగా వున్నవి.

కొన్ని భాగాలు రివైజ్ చేయబడి ఆరవ ముద్రణగా వెలువడింది. వ్యాయామ విద్యపై, క్రీడలపై ఆసక్తిగలవారు తప్పక స్వంతం చేసుకోవలసిన పుస్తకమిది.

అందమైన లామినేషన్ కవరుతో, ఆధునిక టెక్నాలజీతో బైండింగ్ చేయబడినది. **396** పేజీలు గల పుస్తకం వెల కేవలం రు. **50**/-లు మాత్రమే.

ఇట్లు
ఐక్య ఉపాధ్యాయ ప్రచురణలు

APGLIC పుస్తకాలు సిద్ధం

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ లైఫ్ ఇన్సూరెన్స్ పథకంపై సమగ్ర తెలుగు వివరణతో ముఖ్యమైన జి.ఓ.లు, ఫారములతో పుస్తకం వెలువడింది.

దాదాపు 10 లక్షల మంది ప్రభుత్వ, పం.రాజ్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వర్తించే యీ పథకమునకు సంబంధించిన ఉత్తర్వులు, వివరములు ప్రభుత్వ ఆఫీసుల్లో కూడా అందుబాటులో లేవు. అందుచే **APGLIC** డైరెక్టరేట్ వారి సహకారంతో యు.టి.యఫ్. యీ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ స్కీము వర్తించే వారందరు తప్పక కలిగియుండవలసిన పుస్తకం యిది.

అందమైన లామినేటెడ్ కవరుతో 64 పేజీలు గల యీ పుస్తకం కేవలం రు. **10**/-లు మాత్రమే.

ఇట్లు
ఐక్య ఉపాధ్యాయ ప్రచురణలు

కథలు - గేయాలు

"అవినీతి రక్షితి, అరక్షితః"

- బి. నరసింహారావు, ఖమ్మం

"ఇదిగోండి జి.ఓ. కాపీ. ఈ నెలలోనే ఎట్లాగైనా గ్రాంట్స్ తెప్పించి యివ్వాలి" అన్నారు కనకయ్య మాష్టారు, మండల పరిషత్ విద్యా విభాగపు క్లర్క్ రాజుతో. "దానిదేముంది... AOLFతో మాట్లాడి తెప్పిస్తాను. ఇన్ని వేలు వస్తున్నాయి కనుక మన అనవాయితీ ప్రకారం అందరూ పర్సంటేజిలు యిచ్చేటట్లయితేనే" అన్నాడు రాజు. "రాజశేఖర్ గారి లాంటి వాళ్ళు తప్ప అందరం యిస్తాం. గ్రాంట్స్ తెప్పించండి" అన్నారు కనయ్యగారు. రాజశేఖర్ గారి ప్రస్తావన రాగానే "ప్రతీ దానికి వాళ్ళే పెద్ద నిజాయితీపరుల్లా డబ్బులివ్వకుండా అడ్డుపడుతున్నారు. ఏదో కొర్రీవేసి ఆలశ్యం చేస్తాను, వాళ్ళేం చేస్తారో చూస్తాను" అన్నాడు కోపంగా రాజు. సన్నగా నవ్వి వెళ్ళారు కనయ్యగారు.

"గ్రాంట్స్ అన్ని సెంటర్ల నుండి వచ్చాయి. సకాలంలో పంపి గ్రాంట్స్ తెప్పించండి. యం.డి.ఓ. గారు" అన్నారు రాజశేఖర్ గారు. ఆయన అవినీతికి వ్యతిరేకంగా నికరంగా నిలబడిన ఉపాధ్యాయ సంఘ నాయకుడు. "పంపిస్తాం లెండి ! ప్రతీ దానికి మీరు వచ్చి మాకు చెప్పనవసరం లేదు" అన్నారు యం.డి.ఓ. అసహనంగా. ప్రతీ విషయాన్ని మీకు చెప్పాల్సిన పరిస్థితులు మీరే సృష్టిస్తున్నారు. గ్రాంట్స్ ఏదో పేరుతో రానియకుండా ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉంది. డబ్బు ఇవ్వని వాళ్ళవి గ్రాంట్సు రాకపోతే మాత్రం బావోదు" అని చెప్పి వెళ్ళారు రాజశేఖర్ గారు. యం.డి.ఓ., క్లర్క్‌ను పిలిచి అందరి గ్రాంట్స్ తెప్పించు, డబ్బులిచ్చేవాళ్ళు ఎలాగూ యిస్తారుగా... ఎందుకు గొడవ" అన్నారు. గ్రాంట్స్ వచ్చాయి.అందరూ తీసుకున్నారు. డబ్బులు యిస్తానన్న వాళ్ళని రాజశేఖర్‌గారు సంఘ ఇతర బాధ్యులు కలిసి సంఘాలు సమైక్యంగా ఎన్నో పోరాటాలు చేసి జి.ఓ.లు సాధిస్తున్నాయి. కార్యకర్తల త్యాగ ఫలితలే ఈ జి.ఓలు. అదే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగా నిలబడి అమలు చేయించుకోవాలి. అట్లా కాక లంచాల్విడమంటే కార్యకర్తల త్యాగాలను అవమానించడమే కాగలదు" అని చెప్పారు.

చాలా మంది ఉపాధ్యాయులు రాజశేఖర్ గారి మాటలకు స్పందించి "డబ్బులు యివ్వం" లంచాలు లేకుండా పనులు ఎలా ఆఫీసులో చేయరో చూస్తాం" అన్నారు. కొందరు మాత్రం "ఆఫీసు వాళ్ళతో మంచిగా ఉండకపోతే యిబ్బందులు పెడతారు. లంచాలు ఒక్క రోజులో పోతాయా?" అంటూ వెళ్ళిపోయారు. కనకయ్య మాష్టారు మాత్రం "నాయకులు అలాగే మాట్లాడుతారులే" అని తన ప్రక్కనున్న వారితో అనడంతో వారు పకపక నవ్వారు.

అలా కొంతకాలం జరిగింది. ఒకరోజు "నా జి.పి. యఫ్. పార్ట్ ఫైనల్ డబ్బు వచ్చిందిగా ఇచ్చేయండి. అమ్మాయి పెళ్ళికి ఖర్చు వుంది' 'అన్నారు కనకయ్యగారు, క్లర్క్ రాజుతో" అదేంటండి... డబ్బు తీసుకొని వెళ్ళారుగా ... మళ్ళీ అడుగుతారేంటీ ? అన్నాడు రాజు. కనకయ్య గారు షాక్ తిన్నారు. అదేంటి? డబ్బు నేనెప్పుడు తీసుకొనిపోయాను?" అన్నారు. కనకయ్య గారు డబ్బు తీసుకొని వెళ్ళినట్లుగా రసీదులు చూపించాడు క్లర్కు రాజు. "మోసం.. అన్యాయం... దేని కోసమో నా సంతకాలు తీసుకొని డబ్బులు తీసుకున్నట్లుగా మోసం చేస్తావా" అన్నాడు క్లర్క్ డబాయించాడు. అధికారులు కూడా ఉన్న ఆధారాలు చూసి డబ్బు చెల్లించినట్లుగా చెప్పడంతో కనకయ్య గారు హతాసుడైనాడు. 50వేల రూపాయలు గల్లంతవడం అయనకు మతి భ్రమించినంత పనయింది. ఎవరికి జరిగింది చెప్పుకున్నా... క్లర్క్‌తోనూ అధికారులతోను లాలూచీపడే మీకు నిజం తెలియాలి... మేం ఏమీ చేయలేము.." అన్నారు.

రాజశేఖర్ గారు చెప్పిన మాటలతో "ఐక్యంగా నిలబడకపోతే అందరం నష్టపోతామని" గ్రహించిన ఉపాధ్యాయులు కనకయ్య మాష్టారి వక్షాన నిలబడతామన్నారు. ఉపాధ్యాయులు ఆందోళనకు సమాయత్తమవడం గమనించిన అధికారులు సంఘ బాధ్యుల చర్చలకు కబురంపారు. రాజశేఖర్ గారు మొత్తం డబ్బు చెల్లించి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు అంగీకరించి కనకయ్య మాష్టారికి డబ్బుచెల్లించి, క్షమాపణ చెప్పారు.

తనకు కలిగిన అనుభవాలను ఉపాధ్యాయులకు వివరించడం ప్రారంభించాడు. "అవినీతిని రక్షిస్తే అది మనల్నే కబళిస్తుంది. లంచం యివ్వక పోవడం మన ఆత్మ గౌరవానికి చిహ్నంగా భావించాలని" చెబుతున్నాడు. తటస్థంగా ఉండాలనుకొనే వారిలో ఘనీభవించిన ఆలోచనలు కరగనారంభించాయి.

కన్నీటి కణాలు

- అభిలాష, అమలాపురం

పెంచండి! పెంచండి! ఉత్తీర్ణతా శాతం
ఎలా పెరుగుతుందన్నది కాదు ముఖ్యం
ఎంత వస్తుందన్నది మనకు ముఖ్యం
నైతిక విలువలను నేలరాచి
నీతి పాఠాలు వల్లిస్తూ
అవినీతి పరీక్షలు నిర్వహిస్తూ పెంచండి!
పెంచండి! పరిపూర్ణ శాతం, ఉత్తీర్ణతా శాతం
కాసులేందీ కదలదు ఫైలు, మూటలేందే చెల్లదు మాట
మంచి చెడుల మధ్య నలిగిన మనసు
అబద్ధాలు అవార్డులందుకోడం కోసం
చెప్పాలి నిరాశా నిస్పృహల పారం.
పెంచండి, పెంచండి, ఉత్తీర్ణతా శాతం
విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కాదు ముఖ్యం
ఉత్తీర్ణతా సంఖ్యలతోనే సఖ్యం
భావిభారత పౌరుడు కాదు ముఖ్యం
కత్తితో కలానికి సఖ్యం;
పరీక్షల్లో పేపర్ల కుంభకోణాలు
విద్యార్థి మేధావుల గుండెల్లో శూలాలు
జంబ్లింగ్ విధానాల క్రొత్త మలుపులు
అవినీతి పరులకవి క్రొత్త సోపానాలు
ఆపలేని ఈ అరాచకాలు
ఉపాధ్యాయుని కన్నీటి కణాలు

తూట్లు

- జి. మల్లికార్జునుడు, మాచర్ల

బందిపోట్లు - బడుగు పాట్లు
దొంగ నోట్లు - దొంగ ఓట్లు
కత్తిపోట్లు - కన్నె పాట్లు
గన్ను షాట్లు - వెన్ను పోట్లు
ఇవే (నా?) దేశ ప్రగతికి "తూట్లు"

మనం - మన ఆరోగ్యం

కరెంటు షాకు

- డా॥ వి. బ్రహ్మారెడ్డి

విద్యుత్తుకు ఒక గమ్మత్తైన లక్షణం వుంది. అదేమిటంటే ఎటు నిరోధం తక్కువగా వుంటే అటుపోతుంది. మానవ శరీరం ఒక విద్యుద్వాహకం. అంటే మన శరీరంలో నుండి గూడా విద్యుత్తు ప్రవహిస్తుందన్నమాట. అందువలన శరీరంలో ఏ భాగానికయినా కరెంటు తీగలు తగలితే శరీరం గుండా కరెంటు ప్రవహించి భూమిని చేరుతుంది.

"అట్లా మన శరీరంలోంచి విద్యుత్ ప్రవహించడాన్నే షాకు కొట్టడం" అంటాము.

షాకు వలన జరిగే నష్టాలు :

గుండె, ఊపిరి తిత్తులపని స్థంభిస్తుంది

శ్వాసక్రియ ఆగిపోతుంది

కండరాలకు పక్షవాత స్థితి వస్తుంది

శరీరం కాలి గాయాలవుతాయి

అనేక సంధర్భాలలో మరణం కూడా సంభవించవచ్చు.

ప్రథమ చికిత్స :

మొదట షాకు తగిలిన వ్యక్తిని విద్యుత్ప్రవాహము నుండి వేరు చేయాలి. అందుకు స్విచ్‌గాని, మీటర్ దగ్గర మెయిన్ గాని ఆఫ్ చేయాలి.

అది వీలుకాకపోతే రబ్బరు చెప్పులు వేసుకొనిగానీ, పొడిగా నున్న చెక్కపీటపై నిలబడి గానీ, రబ్బరు పట్టామీద గానీ, కొబ్బరి పీచుతో తయారుచేసిన కాళ్ళు తుడుచుకునే పట్టా మీద గానీ, నాలుగు మడతలు వేసిన దుప్పటి మీద గానీ, న్యూస్ పేపర్ నేల మీద వేసి గానీ, వాటిలో ఏదో ఒక దాని మీద నిలబడి మాత్రమే సాయం చేయాలి. అలా నిలబడి ఆ వ్యక్తిని తీగల నుండి దూరంగా లాగేయాలి.

కరెంటు టవర్ల మీద నుంచి తీగ తెగిపడితే కరెంటు ఆపేశారని తెలిసేవారకూ 20 గజాల దూరంలో వుండి సాయం చేయాలి.

వదులుగా పడి వున్న తీగల్ని ఎత్తి పెట్టటానికి ప్రయత్నం చేయకూడదు.

షాకు కొట్టే వ్యక్తిని తీగల నుండి దూరంగా లాగే వారి కాళ్ళకు రబ్బరు చెప్పులున్నా అవి తడిగా వుంటే ప్రమాదం.

ఎండిన కట్టెతో గానీ, కర్రతోగానీ, వెదురు బొంగుతో గాని - ఈ మూడింటిలో ఏదో ఒక దానితో కూడా షాకు కొట్టిన దూరంగా లాగవచ్చు.

ధరించిన దుస్తులు అంటుకొని వుంటే మంటలను ఆర్పివేయాలి. కంరెంటు ఆపిన తర్వాతనే మంటలను ఆర్పటానికి నీళ్ళుపోయాలి.

కరెంటు ఆపకుండాను, తగిన రక్షణ లేకుండానూ, ఎట్టి పరిస్థితులలోను కంరెంటు షాకుకు గురైన వ్యక్తిని నేరుగా తాకరాదు.

రోగి మామూలుగా గాలి పీల్చుతూ, తెలివిలో లేకుండా వుంటే ఏటవాలుగా బోర్లా పడుకోబెట్టాలి. (తెలివిలో లేనిరోగిని పడుకోబెట్టే పద్ధతి ఇది).

వంటి మీద కాలిన బట్టలుంటే వాటిని తొలగించి, శరీరాన్ని చల్లటి నీళ్ళతో తడపాలి.

తర్వాత శ్వాశక్రియను పరిశీలించాలి. శ్వాసక్రియ ఆగిపోయినట్లుంటే ప్రథమ చికిత్సగా ఈ క్రింది పనులు చేయాలి.

ఎ) షాకు తగిలిన వ్యక్తిని వెల్లకిలా పరుండబెట్టాలి.

బి) ఆరోగ్యవంతుడైన ఒక వ్యక్తి గుండెల నిండా గాలి పీల్చుకొని, అతని నోటిని షాకు తగిలిన వ్యక్తి ముక్కు బిగబెట్టి, గాలిని ఆ వ్యక్తి నోటిలోకి ఊదాలి. ఇలా చేసేటప్పుడు రోగి ముక్కును మూసి వుంచాలి.

సి) ఈ ప్రకారంగా నిముషానికి 20 సార్లు ఆ వ్యక్తికి తన శ్వాసక్రియ ఆరంభమయ్యేవరకు చేయాలి.

డి) నాడి అడుతుందో లేదో చూడాలి. నాడిఆగిపోతే "హృదయ మర్ధన" చేయటం ద్వారా గుండె ఆడేటట్లు చేయాలి. నిముషానికి 70 సార్లు గుండెపైన ఎదుర్రొమ్ము ఎముక మీద వత్తాలి.

ఇ) షాకు రాకుండా వుండటానికి, వస్తే దాని ప్రమాదం పెరగకుండా వుండటానికి రోగి కాళ్ళవైపున ఎత్తు పెట్టాలి. తల ప్రక్కకు తిప్పి వుంచాలి.

అసలు షాకు తగలకుండా ఉండాలంటే ఏం చేయాలి ?

ఇంటి వైరింగ్‌లో లీకేజీ వుంటే వెంటనే దానిని మార్పించి, చక్కగా వైరింగ్ చేయించాలి.

ప్లగ్ పిన్ లేకుండా వట్టి తీగలను ప్లగ్‌లో దోపకూడదు.

సరియైన శక్తిగల ఫ్యూజ్ తీగలనే వాడాలి. అధిక శక్తి గలవి, లావుపాటి రాగి తీగలను, ఫ్యూజ్ వైరులుగా వాడరాదు.

ఇంటి వైరింగ్ మీటర్‌కు దగ్గరగా భూమి లోపలకు ఎర్తు చేయాలి.

ఎలక్ట్రిక్ స్థంభాలకు - బట్టలు ఆరవేసేందుకు తీగలు కాని, పశువులను కట్టేయటం గాని చేయరాదు.

తడి చేతులతో స్విచ్‌లను పట్టుకోకూడదు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు లేచినప్పుడు, ఆ మంటలను ఆర్పటానికి నీళ్ళు వాడకూడదు. ఎందుకంటే నీరు విద్యుద్వాహకం. అది మంటలను పెద్దది చేస్తుంది. అందువలన ఇసుక లేదా మట్టిని వాడాలి.

మూడు పిన్నులున్న ప్లగ్ పిన్నులనే వాడాలి. మూడో పిన్ను ఎర్తు అన్నమాట.

నలిగిన, దెబ్బ తిన్న వైర్లను వాడరాదు.

తెగిపడిపోయిన ఏ వైరును అందులో కరెంటు వుందో లేదో తెలియకుండా తాకరాదు.

లూజ్ కనెక్షన్ల వలన విద్యుత్ పరికరాలుచెడిపోవటమే కాక ప్రమాదాలు కూడా జరుగవచ్చు.

మెరుపుల బారి నుండి రక్షించుకోటానికి ప్రతి చోటా మెరుపు అరెస్టర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ట్రాన్స్‌ఫార్మర్లు వున్నచోట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

జాయింట్లు, ఇన్సులేషను సరిగ్గా లేని చోట ఖచ్చితంగా టేపు చేయాలి.

మన ఇళ్ళలో ఎన్నో విద్యుత్ పరికరాలను వాడుతుంటాము. హీటర్లు, రిఫ్రజిరేటర్లు ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్‌లు, కూలర్లు మొదలైన వాటిని ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరుగవు.

ఫ్యూజు వైరు ఎందుకు సన్నగా వుండాలి ?

ఫ్యూజు వైరు వలన ఎంతో ప్రయోజనముంది. విద్యుత్ సర్క్యూట్‌లో ఎక్కడైనా లోపం జరిగి, సార్ట్ సర్క్యూట్ అయితే ఆ సర్క్యూట్‌లో చాలా ఎక్కువ కరెంటు ప్రవహిస్తోంది. అందువలన వైర్లు వేడెక్కి కాలిపోవచ్చు. దానితో ఆ ఇల్లు గానీ, గోడవున్ గానీ, సినిమా హాలు ఏదైనా సరే తగలబడే ప్రమాదముంది. అలా జరక్కుండా నివారించాలంటే ఆ సర్క్యూట్ లోని వైరు ఏదో ఒకచోట అతి బలహీనంగా వుండాలి. అప్పుడు అది ముందుగా కాలి తెగిపోతుంది. అప్పుడు ప్రమాదాలు అరికట్టబడతాయి. అట్లాంటి ప్రయోజనం కోసం అమర్చబడిన వైరునే "ఫ్యూజ్‌వైరు" అంటారు.

సామాన్యంగా మన ఇళ్ళలో వైర్ల సామర్థ్యానికి మించి లోడ్‌ను వాడతాము. ఒకే సమయంలో ఎన్నో పరికరాలనుపయోగించినప్పుడు ఫ్యూజ్ వైరు త్వరగా వేడెక్కి కాలీపోతుంది. అప్పుడు లోడును గురించి జాగ్రత్త పడకుండా చాలా మంది. " ఈ సన్న ఫ్యూజ్ ఊరికూరికే కాలిపోతుంది. ఎన్నిసార్లు వేయాలి" అని విసుక్కుని లావుపాటి ఫ్యూజ్ వైరు వేస్తారు. దానితో అసలుకే ఎసరు వస్తుది.

జాగ్రత్తలు :

రబ్బరు చెప్పులు, రంధ్రాలు లేని రబ్బరు తొడుగులు లేకుండా స్థంభాల మీద పనిచేయరాదు.

కరెంటు స్థంభాలను అనుకోరాదు. వర్షాకాలంలో ఈ జాగ్రత్త మరీ ముఖ్యం.

రోడ్ల ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫారంలు తగిన రక్షణలో వుండవు. అనేకసార్లు మన జాగ్రత్తలో మనం వుండాలి.

విద్యారంగం - తీరుతెన్నులు

విజన్ 2020లో విద్యా రంగం

- కె. జోజయ్య

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1999 జనవరి 26న 'విజన్ - 2020 అనే డాక్యుమెంటును విడుదల చేసింది. 2020 సంవత్సరం నాటికి మన రాష్ట్రం స్వరూప స్వభావాలు మారి "స్వర్ణాంధ్రప్రదేశ్'గా ఎలా రూపొందుతుందో అందులో వర్ణించబడింది. 351 పేజీలున్న యీ డాక్యుమెంటు 19 చాప్టర్లుగా విభజించబడింది. పట్టాణాభివృద్ధి, వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమలు, ఆరోగ్యం, విద్య మున్నగు రంగాలు రానున్న20 ఏళ్ళలో ప్రణాళికబద్ధంగా ఏ మేరకు అభివృద్ధిని సాధిస్తామో, మన ముఖ్యమంత్రి గారి 'హైటెక్ స్వప్నం' ఎలా సుందర రూపం దాల్చనుందో గణాంక వివరములతో అందులో చక్కగానే వివరించారు. ఆ డాక్యుమెంటు ఉపోద్ఘాతంలో తమ సుందర స్వప్నాన్ని క్రింది విధంగా వర్ణించారు -

"పేదరికం తొలగిపోతుంది, అసమానతలు, అంతరిస్తాయి. షెడ్యూల్డ్ కులములు - తెగలు, వెనుకబడినతరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు ముఖ్యంగా జీవితంలో ముందడుగు వేయాల్సిన మహిళలు, పిల్లలు, సాధికారికంగా అభివృద్ధిలో భాగస్వాముతౌతారు. వయసు మళ్ళిన వృద్ధులు, దుర్బల వర్గాలు, వికలాంగులు, సాంఘిక భద్రత లభించి గౌరవప్రదంగా జీవించగలగుతారు. బాలబాలికలందరికి సరైనపోషకాహారం అందుతుంది. ఆరోగ్యంగా, పుష్టిగా ఎదుగుతూ బడికి వెళ్ళి చదువుకో గలుగుతారు. ప్రతి బాలికా ఉద్యోగం పొంది, సంపాదించగలగుతుంది."

పై మాటలలో పేర్కొన్న పురోభివృద్ధి ఆచరణ రూపం దాల్చాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అయితే దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అందుకు అనుకూలంగా వున్నాయా ? పాలకులకు చిత్తశుద్ధి వుందా ? అనేవి సమస్యలు.

మానవ వనరులను తగిన విధంగా అభివృద్ధి చేయడం ద్వారానే ముఖ్యమైన రంగాలలో పురోభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందనేది సర్వత్రా అంగీకరించే విషయం. అట్టి మానవ వనరుల అభివృద్ధిని అందుకు భూమిక అయిన విద్యా రంగ అభివృద్ధిని విజన్-2020లో (పేజీలు 73 నుండి 91 వరకు) ఏ విధంగా అంచనా వేశారో చూడవలసి వుంది.

ఆంధ్రప్రదేశ్ ఒక విజ్ఞాన కేంద్రం - కాకుంటే చాలది కలల కేంద్రం

2020 సం॥ నాటికి ఆంధ్ర ప్రదేశ్ కేవలం అక్షరాస్యతా రాష్ట్రమేగాక ఒక విజ్ఞాన కేంద్రంగా బాసిల్లుతుందట. 21వ శతాబ్ది తెచ్చే సమస్యలను ప్రజలు సమర్థవంతంగా ఎదుర్కొనగలరట. తమ తమ నైపుణ్యాలను పెంపొందించుటకొనేందుకు పలు అవకాశాలను కల్పిస్తారు. అందుకు అవసరమగు అభ్యుదయకరమైన, సమర్థ యాజమాన్యం గల విద్యావ్యవస్థను రూపొందిస్తారు. తద్వారా క్రింది లక్ష్యాలను సాధిస్తారట:

1) ఉన్నత ప్రమాణం గల ప్రాథమిక విద్య, అనియత విద్య, వయోజనవిద్యా పథకముల ద్వారా సార్వత్రిక అక్షరాస్యత సాధన.
2) బాలికా విద్యను పెంపొందించుటకు ప్రత్యేక పథకములు.
3) మార్కెట్ నైపుణ్యాలను వృద్ధి చేసే విధంగా సెకండరీ, మరియు ఉన్నత విద్యపై దృష్టి.
4) ఉన్నత విద్యలో ప్రైవేట్ సంస్థల ప్రధాన భాగస్వామ్యం.
5) ప్రజల భాగస్వామ్యం ద్వారా నిధులను సమకూర్చడం.

పై లక్ష్యాలు, అవి సాధించేందుకు ప్రభుత్వం ఎంచుకొన్న మార్గాల ద్వారా విద్యా రంగంలో అనేక అవాంఛనీయ ధోరణులు చోటు చేసుకొంటాయి. అవేమంటే

1) సామాన్యులకు, బలహీన వర్గాలకు ఉన్నత విద్య గగన కుసుమవుతుంది.

2) శిక్షణ లేని విద్యా వలంటీర్ల వంటి వారి నియామక విధానం వల్ల ప్రభుత్వ విద్య నాసిరకంగా తయారవుతుంది.

3) ప్రజల భాగస్వామ్యం పేరుతో ప్రభుత్వం తన బాధ్యతనుండి తప్పుకోవడం వలన ప్రాథమిక విద్య తీవ్రంగా దెబ్బతింటుంది.

4) ఉన్నత విద్య పూర్తిగా వ్యాపార వస్తువు అవుతుంది.

5) వ్యాపారంగా మారిన విద్యా రంగంలో అవినీతి, అక్రమాలు, మాస్ కాపీయింగ్ వంటివి రాజ్యమేలుతాయి.

6) బలహీన వర్గాల స్కాలర్ షిప్పులు తరిగిపోతాయి. హాస్టళ్ళు మూసివేయబడతాయి.

2020 నాటికి సంపూర్ణ అక్షరాస్యత - అయితే కదా అది వాస్తవికత

మన రాష్ట్రంలోని అక్షరాస్యతా పరిస్థితి మాత్రం యీ డాక్యుమెంటులో నిజాయితీగానే పేర్కొనబడింది. అక్షరాస్యతలో దేశం లోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం 32లో ఆంధ్రప్రదేశ్ 26వ స్థానంలో వుంది. మొత్తంపై 44 శాతంగా వున్న అక్షరాస్యత స్త్రీ పురుషులు, వివిధ సామాజిక తరగతుల మధ్య, ప్రాంతాల మధ్య ఎంతో వ్యత్యాసాన్ని కలిగి వుంది. 1-7 తరగతుల మధ్య మొత్తం డ్రాప్ అవుట్ రేటు 66% గాను, అది యస్.సి.ల విషయంలో 73%గాను,యస్టి.ల విషయంలో 82% గాను వున్నది. ఈ పరిస్థితికి కారణంగా పేదరికం, అందుబాటులో పాఠశాలలు లేకపోవడం, అననుకూల విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి, ప్రాథమిక సౌకర్యాలు అతి తక్కువగా వుండటం, తక్కువ ఎన్‌రోల్‌మెంటు, అధిక డ్రాప్-అవుట్స్‌అని యీ నివేదిక పేర్కొన్నది.

ప్రపంచ బ్యాంకు నిధులతో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణ పథకం (APERP) ద్వారా నాణ్యమైన ప్రాథమిక విద్య అందించి, తద్వారా యీ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించ బడుతుందని యీ నివేదిక తెలియజేస్తోంది. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించడం ద్వారా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని 2002 సం॥ నాటికి 1 : 45 తగ్గించడం, అదనంగా విద్యావలంటీర్లను నియమించడం, వారందరికి ప్రతి సం॥ వృత్యంతర శిక్షణ యివ్వడం,అదనంగా పాఠశాల గదులను నిర్మించడం, ఆశ్రమ పాఠశాలలను పెంచడం, కరిక్యూలమ్‌ను తగిన విధంగా మార్పు చేయడం, మళ్ళీ బడికి పథకం మున్నగు వాటి ద్వారా సంపూర్ణ అక్షరాస్యత సాధించబడుతుందని అందులో పేర్కొన్నారు.

రాష్ట్రంలో 30-40 శాతం పాఠశాలలకు తగినన్ని తరగతి గదులు లేవని చెప్తూ యీ సంవత్సరంలోగా 25 వేల-తరగతి గదులను నిర్మిస్తామని విజన్ 2020లో పేర్కొన్నారు. వాటి నిర్వహణా బాధ్యతను విద్యా కమిటీలకు అప్పగిస్తారు. అందువల్ల నిధుల లేమితో అవి నిరుపయోగంగా తయారవుతాయి. ప్రపంచ బ్యాంకు అప్పుతో కొన్ని పాఠశాలల భవనాలు, తరగతి గదులు నిర్మించబడినా, యితర మౌలిక సౌకర్యాలు కల్పించినా ఆ అప్పు రాష్ట్రానికి భారమై కూర్చుంటుంది. ఇప్పటికే అప్పుల వడ్డీ క్రింద రోజు రు. 2 కోట్లు మన రాష్ట్రం చెల్లిస్తోంది. అయినా పరవాలేదు, "అప్పుచేసి పప్పుకూడు తిందాం" అంటున్నారు మన నేతలు.

అంతులేని అతిశయోక్తులు - ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు

పాఠశాల మౌలిక సౌకర్యాల కల్పనకే అప్పుల వేటలో నున్న ప్రభుత్వం, అదనపు హైటెక్ సౌకర్యాలు కల్పిస్తామని ప్రకటించుకోవడం లాంటి అతిశయోక్తులు కూడా యీ డాక్యుమెంటులో చోటు చేసుకున్నాయి. ప్రతి పాఠశాలకు కంప్యూటర్, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తారట. పాఠశాలలో బోధన కవసరమైన సుద్ద ముక్కలు తదితర కనీస అవసరాలు ఏర్పాటుకు గత 5 సం॥ల నుండి కంటెంజన్సీ నిధులు (మొత్తం రూ. 30 కోట్లు) విడుదల చేయని ప్రభుత్వం

పాఠశాలలకు యింటర్‌నెట్ కనెక్షన్ కల్పిస్తామంటే ఎవరు నమ్మగలరు? "ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గాని కెక్కుతా"నని చెప్తే మనమంతా నమ్మాలి కాబోలు.

సంపూర్ణ అక్షరాస్యతకు సంబంధించిన మరికొన్ని అతిశయోక్తులు కూడా యీ డాక్యుమెంటులో చోటు చేసుకొన్నాయి. 1991 జనాభా లెక్కల ప్రకారం 44% గా వున్న మన రాష్ట్ర అక్షరాస్యత 2020 సం॥ల నాటికి 99 శాతంగా వృద్ధి చెందుతుందని చెప్పడం మన పాలకుల చిత్తశుద్ధిని ఎరిగిన వారికెవరికైనా నమ్మకాన్ని కల్గిస్తుందా ? యస్.సి; యస్.టి., మహిళలలో కూడా ఆనాటికి 99 శాతం అక్షరాస్యత సాధిస్తారట, మిగిలిన ఒక్క శాతం ఎందుకు తగ్గించుకుంటున్నారో అర్థం కాదు. అతిశయోక్తులకు హద్దుల్లేవుగా !

బాలికల విద్యను అభివృద్ధి చేయడానికి కొన్ని ప్రోత్సాహకాలను యిస్తారట. అందుకు బాలికా పరిరక్షణ పథకాన్ని సమర్థవంతంగా 50 వేల మందికి వర్తింపజేస్తారట. 18 సం॥ల వయసు వరకు అవివాహితగా వుంటూ, చదువును కొనసాగించే షరతుపై ప్రతి బాలిక పేరుతో రూ. 5 వేలు డిపాజిట్ చేస్తారట, ఉన్నత పాఠశాల స్థాయినుండి అట్టి బాలికలు ప్రతి సంవత్సరం రు. 1,000/- చొప్పున వివాహ సందర్భంలో రూ. 20 వేల చొప్పున పారితోషికం పొందుతారట. అంతేగాక బాలికల కొరకు కాలేజీలలో ప్రత్యేక వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెడతారు. ఉన్నత విద్యలో వారికి 33 శాతం సీట్లను రిజర్వ్ చేస్తారు. ఇవన్నీ నెరవేరే లక్ష్యాలేనా ?

వృత్తి, సాంకేతిక విద్యా కోర్సులు

పరిశ్రమల కవసరమైన నైపుణ్యము గల వ్యక్తులను తయారు చేయు నిమిత్తం యింటర్మీడియేట్ స్థాయివరకు వృత్తి, సాంకేతిక విద్యా కోర్సులను ప్రవేశపెడతారు. ప్రస్తుతం ఐ.టి.ఐ.ల ద్వారా, పాలిటెక్నిక్ సంస్థల ద్వారా అదింస్తున్నా సాంకేతిక కోర్సులను పెంచడంతోపాటు వాటిని మరింత సమర్థవంతం చేయానికి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తారు.

అట్లే ఉన్నత విద్యలో సంప్రాయకంగా వస్తున్న సైన్స్, ఆర్ట్స కోర్సులను తగ్గించి కంప్యూటర్ అప్లికేషన్స్, బయోటెక్నాలజీ, పరిసరాల యాజమాన్యం వంటి నూతన కోర్సులను ప్రవేశపెడ్తారు. అంతేగాక అత్యున్నత స్థాయి వృత్తి విద్యకై 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' లను ఏర్పాటు చేస్తారు.

అంటే స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తలకు అవసరమైన సాంకేతిక నిపుణులను సమాకూరుస్తారన్నమాట. "కాకుల్ని కొట్టి గద్దలకెయ్యడం అంటే యిదే కాబోలు.

1984లో మన రాష్ట్రంలో సెకండరీ, ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సుల స్థితిని చూస్తే ప్రభుత్వం ప్రకటనలు చేయడమే గాని వాటి ఆలనాపాలనా పట్టించుకోని వైఖరి మన కళ్ళముందే వున్నది. వర్క్‌షాపులు, యంత్రా పరికరాలు సమకూర్చలేదు. వాటికి పాఠ్య పుస్తకాలను రూపొందించడం గాని, వాటిలో పరీక్షలు నిర్వహించడం గాని లేదు. యీ సంవత్సరం డిగ్రీ స్థాయిలో కూడా కొన్ని ప్రభుత్వ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ప్రకటనలకు మోసపోయి, అధిక ఫీజులు కట్టి ఆ కోర్సులలో చేరిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా వున్నది. అయినా విజన్-2020 లాంటి డాక్యుమెంట్లను ప్రకటించి ప్రజలను మభ్యపరచే ప్రయత్నం కొనసాగిస్తూనే వున్నారు.

ఉన్నత విద్య ప్రైవేటుపరం - వున్నవారికి వరం, లేని వారికి శాపం

ప్రపంచ బ్యాంకు నుండి తెచ్చిన అప్పుద్వారానైనా ప్రాథమిక విద్యను అభివృద్ధి పరుస్తామని, సెకండరీ స్థాయిలో వృత్తి విద్యకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఉన్నత విద్యను ప్రైవేటికరిస్తామని స్పష్టంగానే చెప్పింది. అదే సందర్భంలో పేద, బలహీన వర్గాలకు నష్టం జరుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారట. అది నమ్మే అమాయకులున్నారని ప్రభుత్వాధినేతల గట్టి నమ్మకం.

ఉన్నత విద్యా రంగంలో ప్రైవేటు సెక్టారును ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అనేక సౌకర్యాలను సమకూరుస్తుంది. తగినంత పెట్టుబడి పెట్టలేని వారికి బ్యాంకులు, యితర ఆర్థిక సంస్థల నుండి ఆర్థిక సహకారాన్ని యిప్పిస్తుంది. తద్వారా పెట్టుబడిలేని ప్రైవేటు వ్యక్తులు కూడా విద్యా వ్యాపారం చేయవచ్చు. అంటే షరతులు, ఆటంకాలు, పరిమితులు, పేదవారికి; సౌకర్యాలు, ప్రోత్సాహకాలు "ధనిక పేదలకు"

ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా యికపై తమ అవసరాలకు సరిపడా నిధులను తామే సమకూర్చుకోవాలి; స్వయం సమృద్ధి సాధించుకోవాలి... యిది ప్రభుత్వ అభిమతం. అందుకు గాను నూతన అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులనే పేరుతో సేల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో యిప్పటికే ప్రవేశపెట్టారు. దానిని మరింత విస్తృత పరుస్తారు. ఆచరణలో ప్రభుత్వము ఉన్నత విద్యారంగం బాధ్యతను పూర్తిగా వదులుకొనడానికి సిద్ధపడుతున్నది. అంటే ప్రైవేటు సంస్థలు విద్యారంగంలో పూర్తి స్థాయి వ్యాపారాన్ని సాగించడానికి అనుమతించడమే అవుతుంది.

అట్లే ఐ.ఐ.టి. లాంటి ఉన్నతస్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తారట, వాటిని ప్రపంచంలోని ప్రముఖ యూనివర్శిటీలకు అనుబంధం చేస్తారట. (ఇక మన యూనివర్శిటీలు ఎందుకు ? మూసివేసుకోవచ్చు!) మెడిసన్, మేనేజిమెంట్, బయో టెక్నాలజీ, హార్టి కల్చర్, కన్‌స్ట్రక్షన్ వంటి ప్రముఖ విభాగాలలో ప్రత్యేక విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌ని "భారతదేశపు చదువుల రాజధాని"గా అభివృద్ధి చేస్తారట.

ఈ సంస్థల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలకు వందల ఎకరాల భూమిని, ఇతర సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ సంస్థలలో రిజర్వేషన్ల ప్రసక్తే వుండదట. అందువలన సామాన్యులకు, బలహీన వర్గాలకు యీ "ఫైవ్‌స్టార్" విద్యా సంస్థలు అందుకోలేని దూరంలోనే వుంటాయి. ఇక సామాజిక న్యాయం ఏ మేరకు లభిస్తుందనేది ప్రశ్నార్థకమే. ప్రజల మధ్య అసమానతలు మరింత పెరిగి దానికి యిది దారితీస్తుంది.

మరో వైపు యీ "మేధా కేంద్రా'లలో చదవిన వారు మన రాష్ట్రానికి, మన దేశానికి ఏ మేరకు ఉపయోగపడతారనేది కూడా సందేహాస్పదమే. వారి సేవలు బహుళ జాతి కంపెనీలకే దారాదత్తం అనేది యిప్పటికే కనిపిస్తున్న వాస్తవం.

విజన్ 2020 - విద్యారంగ కేటాయింపులు

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 30శాతం వరకు విద్యకు కేటాయించాలని ఖేర్ కమిటి లాంటి జాతీయ విద్యా కమిటీలు పలుమార్లు సిఫారసు చేసినను మన రాష్ట్ర బడ్జెట్‌లో 14 శాతం వరకు మాత్రమే కేటాయిస్తూ వచ్చారు. రానున్న కాలంలో యీ కేటాయింపులను 20 శాతం వరకు పెంచుతామని యీ విజన్‌లో ప్రభుత్వం పేర్కొంటున్నది. పైగా యీ కేటాయింపులో ప్రాథమిక విద్యకు, ఉన్నత విద్యకు పోటీ పెడుతున్నది. ప్రాథమిక విద్యను ఉద్ధరించడానికి ఉన్నత విద్యా కేటాయింపులు తగ్గిస్తుందట.

విజన్ దృష్టిలోకి రాని విద్యా రంగ సమస్యలు

ఈ విజన్-2020 విద్యా రంగానికి సంబందించిన కొన్ని మౌలిక అంశాలను గాని, ఎదురవుతున్న సవాళ్ళను గాని పట్టించుకోలేదు. అందరికీ అక్షరాస్యత - ప్రాథమిక విద్య గరపాలని అభిలాషను వ్యక్తం చేస్తోంది. బలహీన వర్గాల పిల్లల పాఠశాలలకు దూరంగా వుండటానికి కారాణమైన పేదరికాన్ని ఒక సమస్యగా చూడటం గాని, అట్టి వారికి మధ్యాహ్నం భోజన పథకం వంటి ప్రోత్సాహకాల్ని కల్పించాలని భావించడం గాని, వారి తల్లిదండ్రులను పేదరికం నుండి బయటపడవేసే మార్గాలను చూపడంగానీ చేయలేదు.

అలానే పారిశ్రామిక అవసరాలకు అనుగుణ్యమైన కోర్సుల గురించే ఆరాటం కన్పిస్తుంది తప్ప. సామాజిక శాస్త్రాల ప్రస్తావనే కనిపించదు.

(మిగతాది 10వ పేజీలో)

ప్రశ్నోత్తరాలు

నిర్వహణ : ఓ. రామిరెడ్డి

ఎస్. నరశింసహమూర్తి, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా

ప్రశ్న : 1933 సెలవు నిబంధనలు, అధ్యాపక దర్శినిలు ఏలో ప్రచురించారు? 1998 డిశంబరులో ఒక ఉపాధ్యాయుడు 14.12.98 నుండి 23.12.98 వరకు క్యాజువల్ సెలవు పెట్టాడు. మధ్యంతర సెలవులు అకస్మాత్తుగా 23.12.98 నుండి 31.2.98 వరకు ప్రకటించారు. ఆ టీచరుకు సెలవు ఎట్లా మంజూరు చెయ్యాలి?

జవాబు : అధ్యాపక దర్శిని - 2 (1990 ఎడిషన్)లో 1933 సెలవు నిబంధనలు వేశాము. పై టీచరు క్యాజువల్ సెలవు కాలము + మధ్యంతర సెలవు కాలము 10 రోజులు దాటింది కాబట్టి మొత్తం సెలవు కాలమునకు యితర సెలవు మంజూరు చెయ్యాలి. లేదా ప్రభుత్వం నుండి ప్రత్యేక ఉత్తర్వు ద్వారా మినహాయింపు పొందాలి.

శ్రీమతి ఆర్. కనకదుర్గ, దొడ్డిపట్ల, ప.గో.జిల్లా

ప్రశ్న : నేను 24.8.83న స్పెషల్ టీచరుగా చేరాను 1.8.93 నాడు 10 సం॥ స్కేలులో ఫిక్సేషన్ చేశారు. మరల క్రొత్త పి.ఆర్.సి. ప్రకారం 1.7.92 8 సం॥ స్కేలు యిచ్చారు. ఏది సరియైనది?

జవాబు : జి.ఓ. 119 విద్య తేది 21.4.98లో స్పెషల్ టీచర్ల సర్వీసు 8/16 సం॥ స్కేళ్ళకే పరిగణించారు కాని 10/15 సం॥ స్కేళ్ళను యివ్వలేదు అందుచే మీకు 1.7.92 నుండి 8 సం॥ స్కేలు యివ్వడం సరియైనదే.

శ్రీ నాగేశ్వరరావు, ముస్తాబాదు, కృష్ణాజిల్లా

ప్రశ్న : 1) 119 జి.ఓ. ప్రకారం స్పెషల్ టీచర్ల సర్వీసు పరిగణించేటప్పుడు ట్రైండు టీచర్ల సర్వీసు మాత్రమే పరిగణిస్తారా లేక అన్‌ట్రయిండు టీచర్ల సర్వీసు కూడ పరిగణిస్తారా ?

2) అన్ ట్రెయిండు స్పెషల్ టీచరుగా యుండి ట్రయినింగ్ అయిన తర్వాత తిరిగి స్పెషల్ టీచరుగా చేరి రెగ్యులర్ స్కేలులో అబ్జార్బ్ కావడానికి 6 నెలలు పట్టింది. నా తర్వాత నుంచి వారిని వెంటనే అబ్జార్బ్ చేశారు సీనియర్లను అన్యాయం జరిగింది. సరిచెయ్యడానికి వీలవుతుందా?

జవాబు : 1) 119 జి.ఓ.లో రు. 398 వేతనం తీసికొన్న స్పెషల్ టీచర్ల సర్వీసు 8/16 సం॥ పరిగణించమని మాత్రమే ఉంది. ట్రెయినింగు సర్వీసు మాత్రమే తీసికోవాలని లేదు. అందుచే అన్‌ట్రైనింగ్ సర్వీసు కూడా పరిగణించాలి. కొంత అనుమాన జీవులైన అధికార్లకు ప్రతిదీ అనుమానంగానే ఉంటుంది. వారికి వివరించి నచ్చజెప్పడానికి ప్రయత్నించండి.

2) రెగ్యులర్ పోస్టులలో విలీనానికి జాప్యం అందరికి ఒకేలాగ ఉండదు. కొన్ని జిల్లాలలో వెంటనే జరిగింది. కొన్ని జిల్లాలలో నెలలు పట్టింది. స్పెషల్ పండితులు, పి.ఇ.టి.లకు 6-8 సం॥ పట్టింది. ఈ తేడా సరిచేయడం కష్టం.

శ్రీ మహమ్మద్ అలి, పెందుర్తి, విశాఖజిల్లా.

ప్రశ్న : 1.9.81 అన్‌ట్రెయిన్డ్ టీచరుగా ఉర్దూ పాఠశాలలో చేరి 23.7.92 న ట్రెయినింగు పూర్తి చేశాము. మా రెగ్యులర్ యింక్రిమెంట్ ఏ తేది నుండి యిస్తారు.

జవాబు : ట్రెయినింగు పూర్తయిన తేది నుండి మాత్రమే యింక్రిమెంటు యిస్తారు.

శ్రీ ఇ.పి. రాములు, శీతశెట్టినగర్, తూ.గో. జిల్లా

ప్రశ్న : నేను 10.10.83 న సెకండరీగా చేరి 27.5.98 న బి.ఇ.డి ప్రమోషను పొందాను. యఫ్.ఆర్. 22(బి) ప్రకారం పే ఫిక్షేషను చేయలేదు. ప్రమోషనురాని నా జూనియరు 10/99లో 16 సం॥ స్కేలు వచ్చి ఎక్కువ పే ఫిక్సయింది? దీనికి పరిష్కారమేమిటి?

జవాబు : ప్రస్తుత జి.ఓ.ల ప్రకారం ఆటోమేటిక్ అడ్వాన్సుమెంట్ స్కేల్సు తీసికొనే వారికి 22(బి) ప్రకారం ఫిక్స్ చేయరు. కాని యఫ్.ఆర్. 22(1) ప్రకారం ప్రమోషను తేదినాడు కాని 31(2) ప్రకారం పాత యింక్రిమెంటు తేది నాడు కాని ఫిక్షేషను చేసారా. మీ జూనియరుకు యిచ్చే 16 సం॥ స్కేలు కూడా బి.ఇడి. స్కేలుగానే ఉంటుంది. వారికి కూడ ఫిక్షేషను మీలాగే జరుగుతుంది. అందుచే జీతములో తేడారాదు. అయితే మీరు 31(2) ప్రకారం ఫిక్స్ చేయించుకొనకపోతే తేడా వస్తుంది. దాని పరిష్కారం మీ చేతిలోనే ఉంది.

పి. శ్రీనివాసరావు, రాజఒమ్మంగి, శ్రీకాకుళంజిల్లా

ప్రశ్న : నేను గ్రేడు-II హిందీ పండితునిగ పనిచేస్తున్నాను. పండిట్ ట్రెయినింగ్‌కు ఒకటి, సాహిత్యరత్నకు ఒకటి అదనపు అర్హతల యింక్రిమెంటు యిచ్చారు. 1997లో బి.ఎ. ప్యాసయినాను. మరల బి.ఎ. కు అదనపు ఇంక్రిమెంటు వస్తుందా? హయ్యర్ ఫారం బోధిస్తున్నాను. అదనపు అలవెన్సు వస్తుందా?

జవాబు : కొండ నాలుకకు మందు వేసుకొని ఉన్న నాలుక పోగొట్టకొనవద్దు. మీరు 330 జి.ఓ. ప్రకారం గ్రేడు-I స్కేలు యివ్వకుండ గ్రేడ్-II స్కేలు మాత్రమే తీసికొంటూ ఉంటే మీకు హయ్యర్ క్లాస్ అలవెన్సు వస్తుంది.

యం. కృష్ణయ్య, నరసాయపల్లె, మహబూబ్ నగర్ జిల్లా

ప్రశ్న : నేను ప్రాథమిక పాఠశాలలో సెకండరీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాను. బి.ఎ., బి.యిడి. ప్యాస్ అయి ఉన్నాను. ప్రాథమిక పాఠశాల ప్రాధానోపాధ్యాయుని ప్రమోషను పొంది ఆ తర్వాత బి.యిడి. ప్రమోషను పొందితే లాభమా? లేక నేరుగా బి.యిడి. ప్రమోషను పొందితే లాభమా ?

జవాబు : క్రొత్తగా వచ్చిన 538 జి.ఓ. ప్రకారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్ట్‌కు బి.యిడి.తోపాటు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టు కూడా ఫీడర్ కేటగిరీగా చేర్చారు. అందుచే ఆ రెండు పోస్టులు సమానంగా పరిగణించబడుతాయి. దేనిలో చేరినా పే ఫిక్సేషన్ ఒకటిగానే ఉంటుంది. ఏ ప్రమోషన్ ముందువస్తే దానిలో చేరడం లాభం. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా చేరి బి.యిడి.లో కన్వర్టు కావచ్చు. అయితే పే ఫిక్సేషన్ ఉండదు.

టి. వెంకటాచారి, మదనపల్లె, చిత్తూరు జిల్లా

ప్రశ్న : నేను 8-1-74 నుండి గ్రేడ్ - 1 హిందీ పండితునిగా పనిచేస్తున్నాను. 8-11-98 కు 24 సం॥లు పూర్తయింది. నా మామూలు యింక్రిమెంటు 19-3-99 నాడు. 8-11-98 న 24 సం॥ స్కేలును ఒక అదనపు యింక్రిమెంట్ యిచ్చారు. కాని 1-3-99 న యింక్రిమెంట్ రాదని తిరిగి 1-11-99 న యింక్రిమెంట్ వస్తుందని మేనేజుమెంటు వారు చెబుతున్నారు. సరియైనదేనా?

జవాబు : జి.ఓ. 290 ఆర్థిక తేది 22-7-93 ప్రకారం మేనేజ్‌మెంట్ వారు చెప్పేది సరిగానే ఉంది. 24 సం॥లు నిండిన తర్వాత యఫ్.ఆర్. 22 ఎ(1) ప్రకారం పే ఫిక్సేషన్ చేయవచ్చును అని ఉంటే యఫ్.ఆర్. 31(2) వీలు ఉండేది. అలాకాకుండా 24 సం॥లు నిండగానే ఒక అదనపు యింక్రిమెంట్ అని ఉండడమేకాక 12 నెలల తర్వాత మరల యింక్రిమెంట్ వస్తుందని స్పష్టంగా వ్రాశారు. దాని వలన కొన్ని అసంబద్ధతలు ఏర్పడుతున్నాయి.

మహబూబ్ భాష, ఈర్లదిన్నె, కర్నూలు జిల్లా

ప్రశ్న : (1) నేను అప్రెంటస్ టీచర్‌గా 1997 నవంబరులో చేరాను. 2 సం॥లు తర్వాత రెగ్యులర్ స్కేలు ఇచ్చారు. (2) నోషనల్ యింక్రిమెంట్ ఇస్తారా ? ఇంగ్లీషు టీచరును వేస్తే అర్హత ఏమి ఉంటాయి ?

జవాబు : మీ ప్రశ్నలను చాలాసార్లు సమాధానాలు వ్రాశాము. అయినా మరలా జవాబు ఇస్తున్నాం. (1) అప్రెంటిస్ సర్వీసును రెగ్యులర్ సర్వీసుగా పరిగణించారు కాబట్టి అది అన్నింటికి పరిగణిస్తారు. అయితే ఆ కాలానికి యింక్రిమెంట్లు ఇవ్వడం లేదు కారణం టైం స్కేలు యివ్వలేదు. కాని మనం నోషనల్ యింక్రిమెంట్లు ఇవ్వాలని అడుగుతున్నాము. ఎప్పుడు ఇస్తారనేది జ్యోతిష్యం చెప్పలేము. సాధించాలి. (3) ఆలూ లేదు, చూలూ లేదు. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు ఇంకా ఇంగ్లీషు పండితుల పోస్టు మంజూరు కాలేదు. అయినపుడు అర్హతలు ప్రకటిస్తారు. అప్పటివరకు వేచి ఉండాలి.

శ్రీ పి. భావన్న, మతుకులూరు, తూ.గో. జిల్లా

ప్రశ్న : నాకు 8.3.96 తో 24 సం॥లు నిండినవి. నా జూనియరుకు 25-9-97 తో 24 సం॥లు నిండినవి. నా మామూలు యింక్రిమెంటు తేది (ప్రిపోన్‌మెంటు వచ్చి) 1.9.95గా వున్నది. నా జూనియరుకు ప్రీపోన్‌మెంటు లేనందున 1.9.97 మామూలు యింక్రిమెంట్. నాకు 8.3.96 ఒక యింక్రిమెంటు కలుపగా రూ. 3750 అయింది. ఆ తర్వాత 1.3.97, 1.3.98 యింక్రిమెంట్లు. 1.3.98 నాటికి రూ. 4,010 లు అయింది. కాని నా జూనియరుకు 97 సెప్టెంబరు ఒకే నెలలో రెగ్యులర్ యింక్రిమెంట్ మరియు 24 సం॥లు యింక్రిమెంట్ వచ్చినందున 25-9-97 నాటికి రూ. 4,010 లు వచ్చింది. మరలా నేను జూనియర్‌తో ఇంక్రిమెంట్ ప్రీపోన్ చేసుకోవచ్చా?

జవాబు : ప్రస్తుతమున్న ఏ జి.ఓ. కూడా సూటిగ మీ సమస్య పరిష్కారం చూపడం లేదు. మీకు మరల మీ జూనియరుతో ప్రీపోన్‌మెంటు చేయడమే పరిష్కారం. మీరు మీ మేనేజ్‌మెంట్ ద్వారా పూర్తి వివరాలతో పాఠశాల విద్యా సంచాలవారితో ప్రీపోన్‌మెంటుకు పర్మిషనిమ్మని అప్పీలు చేసుకొని, కాపీ యు.టి.ఎఫ్. రాష్ట్ర కార్యాలయానికి పంపండి.

యం.ఎ.కె. దత్తు, అమరావతి, గుంటూరుజిల్లా

ప్రశ్న : బదిలీలపై నిషేధం ఎప్పుడు విధిస్తారు ? ఈసారి బదిలీ జి.ఓ.లలో ఏవైనా మార్పులు ఉన్నాయా ? బదిలీలు ఎప్పుడు జరుగవచ్చు?

జవాబు : ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో బదిలీల జి.ఓ.లో మార్పులను గురించి 25.3.99 న చర్చలు జరిపింది. డ్రాఫ్టు జి.ఓ.కు అనేక మార్పులు కోరాము. ఏప్రిల్ 15 లోగా క్రొత్త జి.ఓ. వస్తుంది. మే 8 - 25 తేదీలలో బదిలీలు జరుగవచ్చు. జి.ఓ. వెలువడనిదే చర్చల వివరాలు వెల్లడించడం భావ్యంకాదు.

ప్రశ్న : ప్రమోషన్లు ముందు యిస్తారా ? బదిలీలు ముందు చేస్తారా?

జవాబు : బదిలీలు ముందు చేస్తారు. ప్రమోషన్లు తర్వాత చేస్తారు. ఖాళీలలో సీనియర్లు బదిలీ కావాలి కాని క్రొత్తగా ప్రమోట అయిన వాళ్లు కారాదనేది ప్రభుత్వ అభిప్రాయం. మనం కూడా అదే అభిప్రాయంతో ఉన్నాం.

ప్రశ్న : క్రొత్త బదిలీ జి.ఓ. కూడా కౌన్సిలింగు పద్ధతితోనే ఉంటుందా?

జవాబు : తప్పక ఉంటుంది.

ప్రశ్న : ప్రభుత్వ, పంచాయితీరాజ్ పాఠశాలలను కలిపి బదిలీలుంటాయా? ఏ మేనేజ్‌మెంట్‌కా మేనేజ్‌మెంట్ ఉంటాయా ?

జవాబు : ఎ.పి. ఎడ్యుకేషన్ సబార్డునేటు సర్వీసు రూల్సు వర్తించే ఉపాధ్యాయులందరుకు ఒకే బదిలీ జి.ఓ. ఉంటుంది. ఒకే బదిలీ కమిటీ ఉంటుంది. అందుచే విచక్షణ ఉండదని గమనించాలి.

(8వ పేజీ తరువాయి)

అట్లే తెలుగు భాష, ఉర్దూ భాషల అభివృద్ధి గురించి యీ విజన్ అసలు పట్టించుకోకపోవడం గమనించదగ్గ విషయం, తెలుగు భాష గురించే ఆలోచించని విజన్‌లో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు, కళలకు స్థానమేముంటుంది ?

పెట్టుబడి ఎక్కడిది ? - పెత్తనం ఎవరిది ?

మొత్తం విజన్ -2020లో విద్యారంగం ఒక విభాగం మాత్రమే. విజన్‌కు అవసరమైన పెట్టుబడులు ఎలా సమకూరుస్తారు ? అనేది సాధారణంగా వచ్చే ప్రశ్న. అలాంటి ప్రశ్నలన్నిటికి యీ డాక్యుమెంటులో రెడీమేడ్ జవాబులున్నాయి. మొత్తం రూ. 30 లక్షల కోట్లు అవసరమని అంచనా. (ఆ అంచనాలలో ఎంత సహేతుకత వున్నదనేది మరో ప్రశ్న) అందులో 20 లక్షల కోట్లు స్వదేశీ, విదేశీ సంస్థల నుండి అప్పుగా సమకూరుస్తారట. రూ. 10 లక్షల కోట్లు ప్రజల సహకారంతో ప్రభుత్వం సమకూరుస్తుంది. (అందుకు ప్రజలు తమ ఆదాయంలో 60 శాతం వరకు పొదుపు చేయాల్సి వుంటుంది.)

విజన్-2020కి అవసరమైన రు. 30 లక్షల కోట్లలో 60, 70 శాతం పెట్టుబడి పెట్టిన వారి చేతుల్లో పెత్తనం వుండకుండా రాష్ట్ర ప్రభుత్వమే అధికారం చలయించగలదా ? యిప్పటికి తీసుకొన్న అప్పులకే ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్య, వైద్యం వంటి సామాజిక రంగాలకు కేటాయింపులు ఎలా తగ్గిస్తున్నది చూస్తున్నాం. ఆ అనుభవంతో మనం విజన్-2020 ని గురించి సుందర స్వప్నం కనగలమా ? స్వర్ణాంధ్ర ప్రదేశ్‌ని దర్శించగలమా ?

అప్పు యిస్తున్నది బహుళజాతి సంస్థలు; అమలు జరిగేది ప్రపంచ బ్యాంకు ఆమోదించిన పథకాలు; వాటిని అమలు పరచేది మరో విదేశీ సంస్థ - ఇదీ మన విజన్. ఇక మన స్వంతం అనేది ఏముంటుంది.

హైటెక్ అభివృద్ధే విజన్ - 2020 లక్ష్యం; అందుకై అందినంత అప్పు తేవడమే మార్గం; సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టి షరతులకు తలొగ్గడమే విధానం.

నియమ నిబంధనలు

అర్ధజీతపు సెలవును నగదుగా మార్చుట
(Encashment of Half Pay Leave)

- కె.కె.

రిటైరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వారి అర్ధజీతపు సెలవు ఖాతాలో నిల్వవున్న సెలవును నగదుగా మార్చుకొను సౌకర్యం జి.ఓ.యం.యస్.నెం. 342 ఆర్థిక, తేది : 30.9.94 (అధ్యాపక దర్శిని - 12, పేజీ - 159) ద్వారా కల్పించబడినది. జి.ఓ. తేది అయిన 30.9.94 న గాని, ఆ తదుపరి గాని రిటైరైన వారికి యీ సౌకర్యం వర్తిస్తుంది.

జి.ఓ. 1994 లో వెలువడినప్పటికి యీ సౌకర్యం కొన్ని జిల్లాలలో పాక్షికంగా వర్తింపజేయబడితే, కొన్ని జిల్లాలలో ఎవరికి వర్తింపజేయబడలేదు. ఈ సౌకర్యం వచ్చినది మొదలు అధికారులు, ముఖ్యంగా యల్.యఫ్. అధికారులు అనేక వక్ర భాష్యాలు చెప్తూ, వివరణలకై ఉన్నతాధికారులకు లేఖలు వ్రాస్తుండటం అందుకు ఒక కారణమైతే, వాటిపై ప్రభుత్వము నుండి వెలువడిన అసంబద్ధ వివరణలనే మరొక కారణంగా చెప్పుకోవచ్చు. దానికి తోడు యిటీవల వచ్చిన జి.ఓ. 234 తేది 27-10-98. సమస్యను మరింత జటిలం చేసింది. దానితో పేరుకే ఒక సౌకర్యం తప్ప దానివలన అత్యధికులకు ఎట్టి ప్రయోజనము లేని పరిస్థితి ఏర్పడింది.

అందుచే అర్ధజీతమును నగదుగా మార్చుకొనే సౌకర్యంపై వచ్చిన వివిధ ఉత్తర్వులను, వివరణలను మరోసారి పరిశీలించవలసి వున్నది. ఆ అవగాహనతో సదరు సౌకర్యం వలన అత్యధికులకు ప్రయోజనం కలిగే విధంగా సవరణ ఉత్తర్వులు సాధించుకొనే ఉద్యమానికి సన్నద్ధులు కావలసి వుంటుంది.

ఎవరికి వర్తిస్తుంది?

అర్ధజీతము సెలవును నగదుగా మార్చుకొనే సౌకర్యము - ఎ) సూపరాన్యుయేషన్ (58 సం॥ల వయసు నిండిన) రిటైర్మెంటు వారికి, బి) వాలంటరీ రిటైర్మెంటు మరియు మెడికల్ యిన్వాలిడేషన్ రిటైర్మెంటు వారికి వర్తిస్తుంది. కంపల్సరీ రిటైర్మెంటు వారికి, రాజీనామా చేసినవారికి, రీ ఎంప్లాయ్‌మెంట్ పొందిన వారికి, సర్వీసులో మరణించినవారికి యీ సౌకర్యం వర్తించదు.

ఎన్ని రోజులకు నగదు చెల్లిస్తారు?

రిటైరయ్యేనాటికి నిల్లవున్న అర్ధజీతపు సెలవులో ఎన్ని రోజులకు నగదు చెల్లిస్తారనే అంశము ఉద్యోగి ఏ విధంగా రిటైరయ్యారనే విషయముపై ఆధారపడి వుంటుంది.

ఎ) సూపరాన్యుయేషన్ రిటైర్మెంట్ : 58 సం॥ల రిటైర్మెంట్ వయసు నిండి రిటైరైన వారి అర్ధజీతపు సెలవు ఖాతాలో "నిల్వ వున్న మొత్తం" రోజులకు నగదు చెల్లించబడుతుంది. ఈ విషయము జి.ఓ. 342 లోని పేరా 9(i) మరియు పేరా - 7 లలో స్పష్టంగా పేర్కొనబడినది.

బి) వాలంటరీ రిటైర్మెంట్/మెడికల్ యిన్వాలిడేషన్ రిటైర్మెంట్ : ఈ రెండు విధములుగా రిటైరైన వారికి అర్ధజీతపు సెలవు నగదు కొన్ని పరిమితులకు లోబడి చెల్లించబడుతుంది.

వాస్తవంగా రిటైర్మెంటు అయిన నాటికి, సూపరాన్యుయేషన్ రిటైర్మెంట్ నాటికి గల మధ్య కాలం ఎంత వుంటుందో అన్ని రోజులకు మించకుండా సంపాదిత సెలవు + అర్ధజీతపు సెలవుల రెండింటికీ నగదు చెల్లించబడుతుంది. అయితే సదరు మధ్యకాలము 240 రోజులకు తక్కువగా వున్ననూ సంపాదిత సెలవు + అర్ధజీతపు సెలవులు రెండింటికి 240 రోజుల పరిమితితో నగదు చెల్లించబడుతుంది. (పేరా - 9(ii))

ఉదా : 1) ఒక ఉద్యోగి వాస్తవ రిటైర్మెంట్ తేదీ, సూపరాన్యుయేషన్ రిటైర్మెంట్ తేదీల మధ్యకాలము 396 రోజులు, సంపాదిత సెలవు నిల్వ 94 రోజులు, అర్ధజీతపు సెలవు నిల్వ 358 రోజులు వున్నవనుకొంటే అతనికి నగదు చెల్లించుటకు అర్హతగల అర్ధజీతపు సెలవు రోజులు క్రింది విధంగా లెక్కించబడతాయి -

వాస్తవ రిటైర్మెంట్ మరియు సూపరాన్యుయేషన్ల మధ్యకాలం	=	396 రోజులు
సంపాదిత సెలవు	=	94 రోజులు (–)
మిగిలిన రోజులు	=	302 రోజులు

అర్ధజీతపు సెలవు 358 రోజులు నిల్వవున్నను 302 రోజులకు పరిమితమై నగదు చెల్లించబడుతుంది.

ఉదా : 2) పై ఉదాహరణలో వాస్తవ రిటైర్మెంట్, సూపరాన్యుయేషన్ల మధ్య కాలము 204 రోజులు మాత్రమే వున్నదనుకొంటే 240 రోజులకు పరిమితమై సంపాదిత, అర్ధజీతపు రోజులకు క్రింది విధంగా నగదు చెల్లించబడుతుంది.

సంపాదిత సెలవు పరిమితి	=	240 రోజులు
నగదు చెల్లించబడిన సంపాదిత సెలవు	=	94 రోజులు (–)
నగదు చెల్లించబడు అర్ధజీతపు సెలవు	=	146 రోజులు

ఏ సూత్రం ప్రకారం లెక్కిస్తారు?

అర్హత గల వారికి చెల్లించవలసిన అర్ధజీతపు సెలవు కాలపు నగదు క్రింది ఫార్ములా (పేరా - 9(ii)(ఎ)) ప్రకారం లెక్కించబడుతుంది-

(అర్ధజీతపు సెలవు వేతనం + డి.ఎ.) -

$$(\text{పెన్షన్} + \text{పి.యి.జి.} + \text{డి.ఆర్.}) \times \frac{\text{అర్ధజీతపు రోజులు}}{30}$$

పై ఫార్ములా యొక్క వివరణ :

i) అర్ధజీతపు సెలవు - రిటైరయ్యేనాటి మూలవేతనం, అదనపు యింక్రిమెంట్లు, కు.ని. యింక్రిమెంట్లు, డ్యూటీ అలవెన్సు మొదలగు వానిలో సగం.

ii) డి.ఎ. - మూలవైతనంపై వచ్చే కరువు భత్యం

iii) పెన్షన్ - 10 నెలల సగటు వేతనం $\times \frac{1}{2} \times$ అర్థ సం॥ సర్వీసు యూనిట్లు ÷ 66 (25-5-98 నుండి 10 నెలల సగటు వేతనం స్థానంలో చివరినెల వేతనం పరిగణనలోనికి తీసుకోబడుతుంది)

iv) పి.యి.జి. - పెన్షన్ ఈక్వివలెంట్ టు గ్రాట్యూటీ

$$\left(\frac{\text{గ్రాట్యూటీ మొత్తం}}{\text{రూపాయి కమ్యుటేషన్ విలువ} \times 12}\right)$$

v) డి.ఆర్. - పెన్షన్‌పై వచ్చే కరువుభత్యం

ఉదా : రు. 4720/- లు మూలవేతనం, రు. 30/-లు కు.ని. యింక్రిమెంటు, రు. 50/-లు అదనపు యింక్రిమెంటు గల ఉపాధ్యాయుడు సూపరాన్యుయేషన్‌పై 30.6.96న రిటైర్‌కాగా, రు. 2326/-లు పెన్షన్, రు. 65000/-లు గ్రాట్యూటీ నిర్ణయించబడినవి. అతని అర్ధజీతపు సెలవు ఖాతాలో నిల్వ వున్న 620 రోజులకు ఎంత నగదు చెల్లించబడుతుంది?

పై సమస్యలోని వివరములను ఫార్ములాలో ప్రతిక్షేపించి అందలి ప్రతి భాగమును ముందు విడివిడిగాను, చివరలో మొత్తం గాను చేయుట సులభమవుతుంది.

ఎ) అర్ధజీతం + డి.ఎ. (పూర్తి జీతం పై)

$$= \frac{(4720 + 30 + 50)}{2} + (4720 \text{ పై డి.ఎ. @ } 35.75\%)$$

$$= 2400 + 1687 = 4087/-$$

బి) $\text{పి.యి.జి.} = \frac{\text{గ్రాట్యూటీ మొత్తం}}{\text{రూ. కమ్యుటేషన్ విలువ} \times 12}$

$$= \frac{65000}{10.46 \times 12} = 518/-$$

సి) పెన్షన్ పై డి.ఆర్. = 2326 × 35.75% = 832/-

డి) పెన్షన్ + పియిజి + డి.ఆర్.

= 2326 + 518 + 832 = 3676/-

∴ నగదు =

$$(\text{అర్ధజీతం + డి.ఎ.}) - (\text{పెన్షన్ + పియిజి + డి.ఆర్.}) \times \frac{\text{రోజులు}}{30}$$

$$= [(4087) - (3676)] \times \frac{620}{30} = 411 \times \frac{620}{30} = 8494/-$$

సందేహాలు - వివరణ ఉత్తర్వులు

జి.ఓ. 342 అమలు సందర్భంగా అధికారులు పలు సందేహాలు వ్యక్తపరచారు. అర్ధ జీతపు సెలవుకు నగదు చెల్లింపు 240 రోజులకే పరిమితమవుతుందని, అర్ధ జీతపు సెలవు వేతనముపై సగం డి.ఎ. మాత్రమే లెక్కించాలని అభ్యంతరాలు లేవనెత్తారు. వాటిపై ప్రభుత్వం, సంబంధిత ఉన్నాతాధికారులు వివరణ ఉత్తర్వులు యిచ్చారు.

పై సందేహాలను నివృత్తిచేస్తూ యీ వ్యాసములో పైన వివరించిన దానికి అనుకూలంగానే యల్.యఫ్. డైరెక్టరు గారు సర్క్యులర్ మెమో ఆర్.ఓ.సి. నెం. 10/పి3/97 తేది 19-2-99 (అధ్యాపక దర్శిని-15, పేజి-111) ద్వారా వివరణ ఉత్తర్వులు యిచ్చారు. అయినా కొందరు అధికారులు అవే సందేహాలను తిరిగి వ్యక్తపరచగా యల్.యఫ్ డైరెక్టరుగారు సర్క్యులర్ మెమో ఆర్.ఓ.సి. నెం. 10/పి3/98, తేది 25-5-98 (అధ్యాపకదర్శిని-15, పేజీ-186) ద్వారా మరల అదే వివరణను యిచ్చారు. అయినా అహం అడ్డు వచ్చిన అధికారులు నేటికీ ఆ సౌకర్యాన్ని సంబంధితులకు వర్తింపజేయక ఏదో ఒక సాకుతో కాలయాపన చేస్తూ వచ్చారు.

అసలుకే ఎసరు పెట్టిన జి.ఓ. 234

అర్ధజీతపు సెలవుకు నగదు చెల్లింపు సౌకర్యంపై క్రింది స్థాయి అధికారులతోపాటు అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, విద్యా విధాన పరిషత్ ఆడిట్ ఆఫీసరు వంటి వారు సందేహాలను వ్యక్తపరుస్తూ వివరణకై ప్రభుత్వానికి వ్రాశారు. ఉన్న సౌకర్యాలను ఏలా వూడగొట్టాలి? లేక ఎలా నిరుపయోగపరచాలని చూస్తున్న ఆర్థికశాఖ వారు జి.ఓ. 234 ఆర్థిక, తేది : 27-10-98 (ఐక్య ఉపాధ్యాయ - ఫిబ్రవరి 99) ద్వారా వివరణ ఉత్తర్వులు యిచ్చారు. ఇవి మొదట యిచ్చిన జి.ఓ. 342కు పూర్తిగా భిన్నమైనవి. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా అరకొరగావున్న అర్ధజీతపు సెలవుకు నగదు చెల్లింపు సౌకర్యం పూర్తిగా నిరుపయోగం స్థాయికి నెట్టి వేయబడింది. ఈ క్రొత్త ఉత్తర్వుల వలన నూటికి 99 మందికి ఎట్టి ప్రయోజనము లభించదు.

ఈ క్రొత్త ఉత్తర్వులలో యిచ్చిన వివరణ ఏమిటి ?

1) సూపరాన్యుయేషన్ రిటైర్మెంట్ అయినవారికి నిల్వలోనున్న అర్ధజీతపు సెలవు రోజులన్నిటికి నగదు చెల్లించవచ్చును.
2) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న విధంగా 240 రోజులకు మించిన అర్ధ జీతపు సెలవు కాలమునకు డి.ఎ. అనుమతించబడదు.
3) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న విధంగా అర్ధజీతముపై దామాషాగా అనగా అర్ధ డి.ఎ. మాత్రమే అనుమతించబడును.
4) సర్వీసులో మరణించిన వారికి గతంలో వర్తించని యీ సౌకర్యం 27-10-98 నుండి అనుమతించబడును.

క్రొత్త వివరణల ఫలితము ఏమిటి ?

పై వానిలో (1) మరియు (4) అంశములు సానుకూలమైన అంశములుగా కనిపిస్తున్నప్పటికి (2) మరియు (3) వ్యతిరేకమైన అంశములు అగుటవలన గతంలో లభించే నగదు కూడా యికపై లభించదు. కారణమేమనగా క్రొత్త నిబంధనల ననుసరించి ఫార్ములాలోని మొదటి భాగమైన అర్ధజీతం సెలవు వేతనంపై సగం డి.ఎ. మాత్రమే అనుమతించబడటం, ఆ రెండింటి మొత్తం రెండవ భాగమైన పెన్షన్ + పి.యి.జి. + డి.ఆర్.ల మొత్తం కంటె తక్కువ గావడం జరుగుతుంది. అందువలన ఎక్కువ సర్వీసులో సూపరాన్యుయేషన్ రిటైర్మెంటు పొందిన వారికి, సర్వీసులో మరణించిన వారి కుటుంబీకులకు పైసా ప్రయోజనం లభించదు.

తక్కువ సర్వీసులో సూపరాన్యుయేషన్ రిటైర్మెంటు / వాలంటరీ రిటైర్మెంటు / ఇన్‌వాలిడేషన్ రిటైర్మెంటు పొందిన వారికి మాత్రం చాలా చిన్న మొత్తాలు లభించే అవకాశం వున్నది. కారణం అట్టివారి అర్ధజీతపు వేతనం కంటే పెన్షన్ తక్కువగా వుంటుంది గనుక ఫార్ములాలోని మొదటి భాగం, రెండవ భాగం కంటె కొంచెం హెచ్చుగా వుండే అవకాశం వున్నది. దాని వలన వచ్చు నగదు మొత్తం మాత్రం ఆఫీసులు చుట్టూ తిరగడానికి చాలకపోవచ్చు.

కొత్త జి.ఓ. రాకముందు వారి పరిస్థితి ఏమిటి ?

మొదటి జి.ఓ. 342, క్రొత్త జి.ఓ. 234 తేదీలయిన 30-9-94 మరియు 27-10-98ల మధ్య రిటైరైన వారికి అర్ధజీతపు సెలవు నగదు చెల్లించబడకపోయి వున్నట్లయితే అట్టి వారికి మొదటి ఉత్తర్వుల ననుసరించి యిప్పుడైనా చెల్లింపు చేయవచ్చును. ఆ మేరకు మెమో నెం. 49578/905/యఫ్.ఆర్-1/ఎ2/98 ఆర్థిక, తేదీ 23-2-99 ద్వారా వివరణ ఉత్తర్వులు యివ్వబడినవి. ఆ మేరకు పాతవారికి కొంత వూరట లభించింది. ●

బడిపిల్లలైన బాలకార్మికులు
ప్రశంసనీయమైన ఉపాధ్యాయుల కృషి

- నాగటి నారాయణ,
సహాధ్యక్షులు, యు.టి.యఫ్.

"మా అమ్మా నాన్న నన్ను జీతానికి వుంచారు. జీతం మానేసి ఇక్కడికి వచ్చాను" అన్నాడు ఒక అబ్బాయి. "ఇదిగోండి, గోవింద్ అనే ఈ కుర్రాడ్ని ఒక కాంట్రాక్టర్ వద్ద నుండి విడిపించి తీసుకొచ్చి యిక్కడ చేర్చాం" అని సువర్ణ అనే టీచర్ చెప్పింది. "మేం చదువుకొని పైకి వస్తాం. మళ్ళీ జీతాలకి, పొలం పనులకి పోం" అంటూ అక్కడ గుమిగూడిన పిల్లలంతా ధైర్యంగా చెప్పారు.

రంగారెడ్డి జిల్లా వికారాబాద్ సమీపంలోని ఒక బాలకార్మిక పాఠశాలలో జరిగిన చర్చ అది. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రోత్సాహంతో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు ది 3-4-99న రంగారెడ్డి జిల్లాలోని బాల కార్మిక పాఠశాలలను సందర్శించటం జరిగింది. మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ నిర్వహిస్తున్న పాఠశాలలో చర్చావేదిక జరిగింది. యు.టి.యఫ్. పి.ఆర్.టి.యు; ఏ.పి.టి.యఫ్, ఎస్.సి.ఇ.ఆర్.టి; డి.పి.ఇ.పి. బాధ్యులు కొందరు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు కొందరు మొత్తం 50 మందికి పైగా ఆ చర్చలో పాల్గొన్నారు.

యు.టి.యఫ్. తరపున రాష్ట్ర అధ్యక్షులు శ్రీ డి. రామిరెడ్డి సహాధ్యక్షులు శ్రీ ఎన్. నారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి మరియు 'ఐక్య ఉపాధ్యాయ' సంపాదక వర్గ సభ్యులు శ్రీ పి. మాణిక్‌రెడ్డి ఈ పర్యటనలో పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజధానికి దగ్గరలోనే వున్నా ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన జిల్లాల్లో అది ఒకటి. పేద ప్రజలు ఎక్కువ, బాల కార్మికులు కూడ ఎక్కువగానే వుంటారు. ఎం.వి. ఫౌండేషన్ చొరవ, సామాజిక స్పృహ కల్గిన కొందరు టీచర్ల సంసిద్ధత, జిల్లా అధికారుల అండదండలతో "బాల కార్మిక విమోచన వేదిక" 1996 ఏప్రిల్‌లో ఏర్పడింది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పట్ల నిబద్ధత కల్గిన ఉపాధ్యాయులు కొందరు ఈ వేదికలో ఆర్గనైజర్స్‌గా వున్నారు. వారిలో అన్ని సంఘాలకు సంబంధించిన సభ్యులు వున్నారు. స్కూల్ టైమ్‌కి ముందే టీచర్లు గ్రామంలో తిరిగి డ్రాపౌట్స్, బడి ఈడుగల పిల్లల్ని గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించి పాఠశాలల్లో చేర్పించారు. సాయంకాలం కూడా గ్రామంలో తిరుగుతూ గ్రామస్థులతో సంబంధాలు పెట్టుకొంటూ బాలకార్మికులతో చర్చించటం, వారిని బడిలో చేర్చే పని చేశారు. అవసరమైనప్పుడు రాత్రి పూట కూడా గ్రామాల్లో బస చేశారు.

ఆ విధంగా వంద గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపట్టారుట. వంద శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని బాల కార్మికులను కూడ సమీకరించారు. డ్రాపవుట్స్, బాలకార్మికుల కోసం ప్రత్యేక పాఠశాలలు నడుస్తున్నాయి. బాల కార్మిక విద్యా శిబిరాలుగా పిలువబడే నడుస్తున్నాయి. బాలకార్మిక విద్యా శిబిరాలుగా పిలువబడే వీటిలో సగటున వందమంది పిల్లలు వున్నారు. పన్నెండు శిబిరాలు ప్రత్యేకంగా అమ్మాయిల కొరకే వున్నాయి.

బాలకార్మిక విద్యావేదిక నిర్వహిస్తున్న శిబిరాల్లో 9-14 సంవత్సరాల పిల్లలు వున్నారు. రెసిడెన్షియల్ సిస్టమ్‌తో వున్న ఈ స్కూళ్ళలో ఆరు నెలల పాటు ప్రత్యేక బోధనాభ్యసన పద్ధతి వుంటుంది. కోర్స్ అనంతరం వారిని అర్హతగల్గిన క్లాసుల్లోకి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తారు. అందుబాటులోని హాస్టల్స్‌లో కూడా ప్రవేశం కల్పిస్తారు. ఈ శిబిరాల్లో బోధకులుగా ఔత్సాహికులైన యువతీ యువకులు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. వారికి నెలకి వెయ్యి రూపాయల చొప్పున డి.పి.ఇ.పి/ ఎం.వి.ఎఫ్. జీతం చెల్లిస్తుంది.

ఉపాధ్యాయ సంఘాలనేతలు సందర్శించిన రాగూరు బాలికల శిబిరంలో విద్యార్థులందరూ ఆటపాటలతో విద్యనభ్యసిస్తున్నారు. గదుల్లోని గోడల నిండా చార్ట్స్, మ్యాప్స్ వున్నాయి. అక్కడ 9 మంది వాలంటీర్స్ వున్నారు. 4 గురు వర్కర్స్ వున్నారు. భోజనం, బుక్స్ బాక్సెస్ వగైరా సౌకర్యాలు ప్రభుత్వ శాఖలు మరియు కొందరు దాతలు సమకూరుస్తున్నారు. జిల్లా గర్ల్ చైల్డ్ ప్రాజక్ట్, అక్షరసాధన, డ్వాక్రా గ్రూప్‌లు వారూ వీరూ అందరూ ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నారు.

బి.కె.వి.వి. ఆధ్వర్యంలో డ్రాపవుట్ / అన్ ఎన్‌రోల్డ్ పిల్లల కోసం 120 గ్రామాల్లో సమ్మర్ స్కూల్స్ నడుస్తున్నట్లు చెప్పారు. 40 రోజులపాటు నడిచే ఈ స్కూల్స్‌లో సగటున 30 మంది పిల్లలుంటారు. సమ్మర్ స్కూల్స్‌లో బ్రిడ్జి కోర్స్ బోధించబడుతుంది. స్వల్ప వ్యవధిలో పిల్లలను వారి వయసుకి తగిన తరగతిలో చేరేలా తర్ఫీదు యివ్వటమే బ్రిడ్జి కోర్స్ లక్ష్యం. ఇది మంచి ఫలితాన్ని యిచ్చినట్లు చెప్పారు. అధికారులు, గ్రామస్థుల నుండి మంచి ప్రోత్సాహం లభించింది.

ఆచరణలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని రాష్ట్రమంతటా అమలు పర్చాలని అధికారుల ఆలోచన. చర్చలో పాల్గొన్న టీచర్లు వలంటీర్‌లు, నిర్వాహకులు ఎంతో ఉత్సాహంగా మాట్లాడారు. శ్రీమతి సుబ్బరత్నారెడ్డి చెప్పిన అనుభవాలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. పట్టుదల వుంటే బాలకార్మిక వ్యవస్థలను నిర్మూలించటం సాధ్యమేనంటూ ఆత్మ విశ్వాసంతో చెప్పారు.

ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్ని బలపర్చటానికి ఉపయోగపడుతుందని ఫౌండేషన్ ప్రతినిధి శ్రీ వెంకటరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ సంఘాల ప్రోత్సాహం కూడా వుంటే మరింత ముందుకెళ్తామని శ్రీయుతులు చంద్రయ్య సంగమేశ్వరరావు, అంజయ్య, మహిపాల్, విజయ్, సువర్ణ తదితరులు చెప్పారు.

ఈ ప్రోగ్రామ్‌ని పైలట్‌గా నిర్ధారించి రాష్ట్రమంతట రానున్న వేసవిలో బ్రిడ్జి కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఉపాధ్యాయ సంఘాలు కూడా దీని ప్రయోజనాన్ని గమనించి స్పందించాల్సి వున్నది. ●

మీరు చదువుచున్నారా?

'ఏకలవ్య' వారి ప్రచురణ
'సందర్భ్' - హిందీ ద్వైమాసిక పత్రిక

- టి.జి. సంజీవరావు, యు.టి.యఫ్. అకడమిక్ సెల్

భారతీయ విద్యారంగంలో వినూత్న స్థానం సంపాదించుకొన్న 'ఏకలవ్య' సంస్థ 'ఐక్యఉపాధ్యాయ' పాఠకులకు, యు.టి.యఫ్. సభ్యులకు సుపరిచితమే.. 'హోషంగాబాద్ విజ్ఞాన శాస్త్ర కార్యక్రమం (H.S.T.P.) గా ప్రారంభమై మాధ్యమిక పాఠశాల స్థాయిలో విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్ర విషయాల అభ్యసనంలో దేశానికంతటికీ ఆదర్శప్రాయమైన పాఠ్య (కార్య) పుస్తకాలు రచించి, కార్యాచరణ విధానాన్ని రూపొందించడమే కాక, ప్రాథమిక స్థాయిలో అన్ని పాఠ్యాంశాల్ని నేర్పే 'ఖుషీ - ఖుషీ' పుస్తకాల్ని కూడా ప్రవేశపెట్టింది. 'తక్కువ ఖర్చు-ఖర్చులేని' (Low cost - No cost) పరికరాలతో విజ్ఞానదాయకమైన ఆట వస్తువుల్ని (Toys) కూడ తయారు చేసి భారతదేశంలో ఆసక్తి గల అన్ని ఉపాధ్యాయ సంఘాలకు పరిచయం చేసింది 'ఏకలవ్య'

1989 ఏప్రిల్‌లో హైద్రాబాద్‌లోను, ఆ తరువాత నెల్లూరులోను ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌లు నిర్వహించి, తమ విధానాలలో ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ప్రతి సంవత్సరం వేసవిలో తాము జరిపే ఉపాధ్యాయ శిక్షణా శిబిరాలకు 'ఐక్య ఉపాధ్యాయ ఫేడరేషన్' సభ్యుల్ని ఆహ్వానించడం, సంఘ కార్యకర్తలు హాజరవడం జరుగుతూ వస్తున్నది.

ఏకలవ్య సంస్థవారు బాలల కోసం 'చక్ మక్' మాసపత్రికను నడుపుతున్నారు. అట్లే ఉపాధ్యాయుల కోసం 'హోషంగా బాద్ విజ్ఞాన్' ను నడుపుతున్నారు. ఇప్పుడు 'సందర్భ్' అనే ద్వైమాసిక పత్రికను నడుపుతున్నారు. 1994 సెప్టెంబరులో ప్రారంభమై నేటికి 26 సంచికలు ప్రచురించారు. ఈ పత్రిక మొదటి సంచిక యు.టి.యఫ్. ముఖ్య కార్యకర్తలకు ఉచితంగా పంపబడింది.

మల్లెపూలు, మామిడిపండ్లు ఎండాకాలంలోనే ఎందుకు దొరుకుతాయి ? చామంతులు, బంతిపూలు శీతాకాలంలోనే పూస్తాయెందుకు? టొమాటోలు, నిమ్మకాయలు ఏడాది పొడుగునా లభిస్తాయేం ? సంవత్సరంలో మిగతా కాలమంతా స్తబ్ధుగా ఉండి వేసవి దగ్గర పడగానే 'లే, లెమ్మ'"ని మల్లెల్ని, మామిళ్ళనీ మేల్కొల్పి పుష్పించేట్టు పురికొల్పేది ఏది ? తరగతిలో ఎవరైనా బాలుడో, బాలికో ఈ ప్రశ్నవేస్తే సమాధానం చెప్పడానికి ఉపాధ్యాయులు తయారుగా ఉండవద్దా ?

అట్లే ఏనుగులు తొండంతో నీరు పీల్చుకుని, నోటిలో పోసుకోవడం మనం చూస్తాం. మరి ఏనుగుపిల్ల తల్లి స్తనాల నుంచి పాలు అలాగే పీల్చుతుందా ? అసలు ఏనుగు స్తనాలు ఎక్కడుంటాయి ? మేకలు, గేదెలు, ఆవులవలె వెనుక జతకాళ్ళ మధ్యేనా ?

ఢిల్లీలోని కుతుబ్‌మీనార్‌ను కట్టించిన కుతుబుద్దీన్-ఐ-బేగ్ బానిసవంశపు సుల్తానే కదా. బానిసలు పాలకులెలా అయ్యారు.

గణితమంటే అత్యధిక విద్యార్థులకు భయమెందుకు ?

భాష ఎలా నేర్పాలి ? భూగోళ పటాల్ని ఎలా అధ్యయనం చేయించాలి ? వాతావరణంలోని మార్పుల్ని ముందుగానే ఎలా కనిపెడతారు ? ఇలాంటి సమస్యలెన్నింటినో ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఎదుర్కొంటూ ఉంటారు. ఈ సమస్యలకు సమాధానాలిస్తూ కొత్త విషయాల్ని పరిచయం చేస్తూ, ఉపాధ్యాయులకు మంచి సమాచార పత్రిక (Source Magazine) గా ఉపయోగపడే హిందీ పత్రిక 'సందర్భ్'.

దీనిలో ఉపాధ్యాయులు విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ప్రకృతి మొదలైన వాటిపై ప్రశ్నలడిగితే జవాబులిచ్చే శీర్షిక 'సవాలీ రామ్' ఉన్నది. 'ఉపాధ్యాయుల మాటల్లో' అనే శీర్షిక కింద ఉపాధ్యాయుల బోధనానుభవాలు అనుభవాల్ని బట్టి వారిచ్చే సూచనలు విద్యా విషయాలపై కార్టూన్ చిత్రాలు, కథలు, గేయాలు 'సందర్భ్'లో ఉంటాయి.

'బుర్ర కాస్త విదిలించండి' శీర్షికన చిక్కు ప్రశ్నలు, 'నాణేల్ని తలం మీద నిలబెట్టలేము. కాని పరిగెత్తించగలం. ఏంటి కిటుకు? ప్రసిద్ధ ఉపాధ్యాయుడు జాన్ హోల్ట్ రాసిన 'విద్యార్థులు ఎలా 'ఫెయిల్' అవుతారు ? 'విద్యార్థులు ఎలా నేర్చుకుంటారు?' లాంటి పుస్తకాల సమీక్షలు కూడా 'సందర్భ్' లో ఉంటాయి. హిందీ తెలిసిన ప్రతి ఉపాధ్యాయుడూ చదవవలసిన పత్రిక 'సందర్భ్'

ప్రాప్తిస్థానం : 'ఏకలవ్య', కోఠీ బజార్, హోషంగాబాద్ - 461 001. సంవత్సర చందా రు. 50 /-.

ఉపాధ్యాయ నేస్తమా

- వి.వి.యస్. ప్రభాకర రాజు, కపిలేశ్వరపురం

ఉపాధ్యాయ నేస్తమా ! ఐక్య ఉపాధ్యాయ పుస్తకమా !
ముఖ చిత్రాలతో ప్రభుత్వ మనోభావాలకు అర్థం పడతావు
పాఠకుల అభిప్రాయాలతో బేటీ పడతావు
బదిలీలు కావాలా ? అంటూ...
ఆప్యాయతతో పలకరిస్తావు
సంపాదకీయంతో
సాధించబోయే సమస్యలకు పొనపడతావు
వార్తా ప్రపంచమంటూ
విజ్ఞానాన్ని అందిస్తావు
కథలు గేయాలతో ఉల్లాసాన్నిస్తావు
నడుస్తున్న చరిత్రకు భాష్య చెప్పి విజ్ఞాన వీధిన నడిపిస్తావు
మీకు తెలుసా ! అని పలకరించి ఆరోగ్య చిట్కాలు అందిస్తావు
ప్రశ్నోత్తరాలతో గుండెభారాన్ని గుదిబండలా
ఉన్న అడ్డంకులను తొలగిస్తావు
సాధించిన విజయాలతో
ప్రభుత్వ ఉత్వర్వుల పేజీ అంటూ నిలుస్తావు
అందుకే ఓ నేస్తమా
నిలుస్తావు ఉపాధ్యాయుల హస్తాలలో
రజతోత్సవ సంబరాలకు
అంబరాలెక్కి తూర్పు గోదావరి వస్తున్న
ఆనందవేళ అందుకో మా ఈ అక్షర ఆహ్వాన లేఖ !

విజ్ఞాన వీధి

INSAT-2E ప్రయోగ సందర్భంగా
ఉపగ్రహాలు ఎలా ప్రయోగిస్తారు ?

- జి.సి. మధుసూదనరావు



ఈ రోజులలో టి.వి.లలో ఎక్కడో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను చూడగలుగుతున్నాం. ప్రపంచంలో ఎక్కడ ఉన్న వ్యక్తితోనైనా మాట్లాడగలుగుతున్నాం. ప్రకృతి వైపరీత్యాలను గూర్చి ముందే తెలుసుకో గలుగుతున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ జీవితంలో నేడు ఉపగ్రహ సమాచారం లేనిదే నిమిషమైనా గడవని పరిస్థితి ఏర్పడబోతుంది. అలాంటి ఉపగ్రహాలు ఎలా ప్రయోగిస్తారు ? అనే అనుమానం చాలా మందిలో తలెత్తడం సహజం. కాని అడిగితే ఏమనుకొంటారో యన్న సందేహంతో మౌనంగా వుండిపోతున్నారు. నేడు ఏప్రిల్ నందు ఇన్‌శాట్ -ఇని ప్రయోగించనున్న సందర్భంను పురస్కరించుకొని ఉపగ్రహాలు ఎలా ప్రయోగిస్తారో తెలుసుకుందాం!



ఉపగ్రహాలు - రకాలు : ఉపగ్రహాలు రెండు రకాలు 1) సహజ సిద్ధమైన ఉపగ్రహాలు, 2) కృత్రిమ ఉపగ్రహాలు. అంతరిక్షంలో ఒక గ్రహం చుట్టూ తిరిగే ప్రకృతి సహజ వస్తువునే ఉపగ్రహం అని ప్రాచీన కాలంలో పిలిచేవారు. అంటే ఇవి కక్ష్యలో ఎక్కువ ద్రవ్యరాశి ఉన్న కక్ష్యతో ఒకదానికొకటి పరస్పర సహకారంతో తిరుగుతాయి. ఉదా : చంద్రుడు భూమికి ఒక ఉపగ్రహం.

మానవునిచే నిర్మించబడి కక్ష్యలోనికి ప్రవేశపెట్టబడిన దానిని కృత్రిమ ఉపగ్రహం అని అందురు. ఇవి కూడా భూమి చుట్టూ తిరుగుతాయి.

ఉపగ్రహల చరిత్ర : ఉపగ్రహలను గూర్చి మొదటిసారిగా 1902 సం॥లో కలుంగ పట్టణానికి చెందిన కాన్‌స్టాంటిన్‌తిస్‌లో "విస్కే" అనే మూగ విద్యాలయ ఉపాధ్యాయుడు 'రాకెట్' ద్వారా అంతరిక్షాన్ని చేధించవచ్చునని తెలిపాడు. తరువాత 1945 సం॥లో 'ఆర్థర్ సిక్లార్క్' అనే బ్రిటిష్ సైన్స్ ఫిక్షన్ రచయిత '2001 ఎ స్పేస్ బడేస్సే' అనే పుస్తకం ద్వారా సింక్రోనస్ కమ్యూనికేషన్ శాటిలైట్ గురించి వివరించాడు. తన వివరణలో 42,242 కి.మీ. వ్యాసార్థం గల "సర్క్యులర్ ఈక్విటీరియల్ ఆర్బిట్ ' యొక్క కోర్ణయ వేగం భూకోర్ణయ వేగంనకు సరిపోయే విధంగా ఉన్నప్పుడు ఉపగ్రహాన్ని అంతరిక్షంలో ప్రవేశపెట్టాలి. స్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టబడిన ఉపగ్రహం అదే కక్ష్యలో ఉండి, అది భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుందని వివరించాడు. వీరి వివరణల ఫలితంగా శాస్త్రవేత్తలు శ్రమించి నేడు ఉపగ్రహాలను పలు రకాలుగా పంపుతున్నారు.

కృత్రిమ ఉపగ్రహాలు - రకాలు :

కృత్రిమ ఉపగ్రహాలు రెండు రకాలు 1) లో ఎర్త్ అర్బిటింగ్ శాటిలైట్, 2) జియో - స్టేషనరీ శాటిలైట్స్. వీటిని గూర్చి తెలుసుకుందాం!

1) లో ఎర్త్ ఆర్బిటింగ్ శాటిలైట్ : ఈ రకపు శాటిలైట్స్ భూమి ఉపరితలంపై 800 నుండి 1200 కిలోమీటర్ల ఎత్తులో భూగోళం చుట్టూ తిరుగుతుంటాయి. అవి తిరుగుతున్న భూ కక్ష్య ఎత్తును బట్టి తిరుగుతూ తమ నిర్ధేశించిన పనులను నిర్వర్తిస్తాయి. వీటినే రీమోట్ సెన్సింగ్ శాటిలైట్ అని అంటారు. మన దేశం ప్రవేశపెట్టిన ఐఆర్ఎస్-1బి, ఐఆర్ఎస్-1సి, ఐ.ఆర్.ఎస్.-పి3 ఈ రకానికి చెందినవే.

జియో - స్టేషనరీ శాటిలైట్స్ : ఇవి భూ ఉపరితలానికి 36,000 కిలోమీటర్ల ఎత్తు పైన గల కక్ష్యలో భూగోళం చుట్టూ తిరుగుతుంటాయి. ఇవి ఇక్కడ భూగోళం స్పీడ్‌కు సమానమైన వేగంతో భూగోళాన్ని చుట్టుతుంటాయి. ఈ రకమైన శాటిలైట్స్ భూమిపైన ఒక ప్రదేశాన్నుండి పంపిన సంకేతాలను అందుకుని మరలా వాటిని ఎక్కువ భూభాగానికి పంపుతాయి. వీటి వల్లనే నేడు టెలివిజన్, టెలికమ్యూనికేషన్, రేడియోలు తాజా సమాచారాన్ని విశ్వవ్యాప్తంగా అందిస్తున్నాయి. ఈ కోవకు చెందినదే ఇండియన్ ఇన్‌శాట్ సీరీస్ ఉపగ్రహాలు.

ఉపగ్రహాల్ని ఎలా ప్రయోగిస్తారు ?

మనం ఏదైన ఒక వస్తువును పైకి విసిరినపుడు అది తిరిగి రెట్టింపు వేగంతో భూమిపైనే పడుతుంది. భూమికి గల గురుత్వాకర్షణ శక్తివల్ల ఈ విధంగా జరుగుతుంది. దీనిని 'జి'తో సూచిస్తారు. ప్రతి వస్తువును బూమి ప్రతి సెకనుకు 9.8 మీటర్ల వేగంతో లాగుతుంది. అందుచేతనే అంతరిక్షంలోకి ప్రవేశపెట్టే ఉపగ్రహాన్ని భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటి పోయే ఎత్తులోకి ప్రవేశపెట్టాలి. అందుచేతనే ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టడానికి వాహన సెకను ఉపయోగిస్తారు. వాహననౌక (రాకెట్) న్యూటన్ మూడవ గమన నియమాన్ని అనుసరించి పనిచేస్తుంది. దీనికై కావలసిన శక్తిని రాకెట్‌లో ఇంధనం మండించడం ద్వారా విడుదలయ్యే వాయువులు అందిస్తాయి. ఈ వాహక నౌకలో రెండు మూడు రాకెట్ సెక్షన్లుంటాయి. వీటినే స్టేజీలు లేదా దశలు అంటారు. మొదటి దశలో రాకెట్లో ఉన్న ఇంధనాన్ని మండిచడం వల్ల విడుదలైన శక్తి వాహక నౌకని ఆకాశంలోకి నెడుతుంది. తర్వాత రెండో దశలో మళ్ళీ ఇంధనం మండించడం ద్వారా (అంతా కంప్యూటరే చేస్తుంది) ఉపగ్రహం కక్ష్యలోనికి నెట్టబడుతుంది. ఇందులో ఇంధనంగా ద్రవ లేదా ఘన ఇంధనము మరియు ఆక్సిడైజర్ వాడుతారు. అది సరే రాకెట్లలో ఏ ఇంధనం వాడతారు ? ద్రవ ఇంధనమే ఎందుకు వాడాలి యన్న సందేహం ఈ పాటికే మీకు వచ్చిందనుకొంటాను. అందేకే రాకెట్లలో ఏ వాయువులు వాడతారు ? ఎందుకు ద్రవ ఇంధనం వాడతారో తెలుసుకొందాం !

ద్రవ ఇంధనం ఎందుకు :

అంతరిక్ష నౌకల్లో ఇంధనంగా హైడ్రోజన్‌ను మరియు ఆక్సిజన్ వాయువుల్ని నింపుతారు. అంతరిక్ష నౌకలన్నిటిలోనూ ఇంధనం (హైడ్రోజన్) కంబష్చన్ ఛాంబర్ (వాయువులు మండే గది) లోకి నిరంతరం ప్రవహిస్తుంది. ఈ గదిలో ఇంధనం మండడం మూలంగా వెలువడిన ఆవిర్లు వెనుక భాగంలో ఉన్న చిన్న రంధ్రం ద్వారా బయటకు పోతాయి. ఫలితంగా రాకెట్ పైకి దూసుకుపోతుంది. అయితే ఇంధనం మండాలంటే ఆక్సిజన్ వుండాలి కదా ? అసలు అంతరిక్షంలో ఆక్సిజన్ ఉండదు కదా



అంటారా ? అందుకే రాకెట్‌లో హైడ్రోజన్‌తోపాటు ఆక్సిజన్‌ను కూడా నింపుతారు. ఇక హైడ్రోజన్, ఆక్సిజన్ రెండింటిని కూడా ద్రవ రూపంలో ఉంచడం ఎందుకంటే ద్రవరూపంలో ఉన్న పదార్థాలను నిల్వ చేసేందుకు తక్కువ స్థలం సరిపోతుంది. అందుచే ద్రవ ఇంధనం వాడతారు సుమా!

తూర్పు తీరం నుంచే ఎందుకు ?

ఉపగ్రహాలను తూర్పు తీరం నుంచే ఎందుకు ప్రయోగించాలి యన్న సందేహం ఎందరిలోనో ఉంటుంది. శాస్త్రీయంగా చూస్తే భూమి సూర్యుని చుట్టూ పశ్చిమం నుంచి తూర్పు దిశగా తిరుగునన్న విషయం తెలిసిందే. తూర్పు తీరం నుంచి తూర్పు వైపుకు కొద్ది కోణంలో వంగి ఉండేట్లు ఉపగ్రహాన్ని ప్రయోగిస్తే ఉపగ్రహ వేగానికి భూ భ్రమణం యొక్క వేగం కూడా తోడవుతుంది. అందువల్ల ఇంధనం ఆదా అవుతుంది. అలాకాక ఉపగ్రహాన్ని ప్రయోగించే రాకెట్ వేరే దిశలో వంగి ఉంటే భూ భ్రమణవేగం ఉపగ్రహావేగానికి వ్యతిరేకంగా పనిచేయడం వలన అధిక ఇంధనం ఖర్చవుతుంది.

మరో కోణం నుండి చూస్తే రాకెట్ ప్రయోగం విఫలం అయినప్పటికీ భూమి పశ్చిమం నుండి తూర్పుకు తిరుగుట వల్ల రాకెట్ సముద్రంలోనే కూలిపోతుంది. అదే పశ్చిమ నుంచి ప్రయోగిస్తే విఫలమైతే భూమి మీదే పడే ప్రమాదం వుంది. అందుకే తూర్పు తీరం నుంచే ప్రయోగిస్తారు.

ఉపగ్రహాల కక్ష్యలు 3 రకాలు :

ఉపగ్రహాలు పరిభ్రమించే కక్ష్యలు 3 రకాలు. 1) హై ఆల్టిట్యూడ్ జియో సింక్రొనస్ కక్ష్య (భూ స్థిర కక్ష్య), 2) సన్ సింక్రోనస్ పోలార్ కక్ష్య, 3) లో ఆల్టిల్యూట్యూడ్ కక్ష్య. వీటి గూర్చి రేఖా మాత్రంగా తెలుసుకొందాం!

1) హై అల్టిట్యూడ్ జియో సింక్రోనస్ కక్ష్య : ఈ కక్ష్య భూమధ్య రేఖకు పైన 36,000 కి.మీ.ల ఎత్తులో ఉంటుంది. అందుచే ఈ కక్ష్యలోనికి ఉపగ్రహాన్ని పంపాలంటే శక్తివంతమైన వాహక నౌకలు వాడాలి. ఈ కక్ష్యలో ప్రవేశ పెట్టబడిన ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరిగే దిశలోనే అదే వేగంతో పరిభ్రమిస్తుంటాయి. ఈ ఉపగ్రహాలనే జియో-స్టేషనరీ శాటిలైట్స్ అంటాం. రేడియో, టెలివిజన్, టెలికమ్యూనికేషన్స్ వాతావరణ సమాచారాలను మనం ఈ శాటిలైట్స్ ద్వారానే తెలుసుకొంటున్నాం. మన ఇన్‌శాట్ సీరీస్ ఈ కోవకు చెందినవే.

సన్ - సంక్రోనస్ పోలార్ కక్ష్య : ఈ కక్ష్య ఉత్తర దక్షిణ ధృవాలపైన ఉంటుంది. దీంట్లో తిరిగే ఉపగ్రహాన్ని రోజూ ఒకే సమయంలో భూమధ్యరేఖా ప్రాంతాన్ని దాటేటట్లు ఏర్పాటు చేస్తారు. ఇవి భూమి చుట్టూ తిరుగుతూ సమాచారాన్ని అందిస్తాయి.

లో అల్టిట్యూడ్ కక్ష్య : భూమి ఉపరితలంపై 800 నుండి 1200కి.మీ.ల ఎత్తులో వుండే కక్ష్య ఇది. ఈ కక్ష్యలో ప్రవేశపెట్టే ఉపగ్రహాలు భూకక్ష్య ఎత్తును బట్టి ప్రతి 100 నుండి 150 నిమిషాలకు ఒకసారి భూగోళం చుట్టూ పరిభ్రమించి భూసమాచారం పంపుతాయి. రీమోట్ సెన్సింగ్ శాటిలైట్స్ ఈ కోవకు చెందినవే !

ఉపగ్రహం ఎలా తిరుగుతుంది ? : ఉపగ్రహాన్ని భూ ఉపరితాలనికి 35,870 కి.మీ. (22,921 మైళ్ళు) ఎత్తుకు పంపిస్తారు. ఉపగ్రహం 1 సెకనుకు 3.2కి.మీ. వేగంతో భూమి చుట్టూ తిరుగుటకు 24 గం॥లు పడుతుంది. ఉపగ్రహ వేగం తగ్గినా, నిర్ధేశించిన కక్ష్యలోనికి వెళ్ళలేకపోయినా ఉపగ్రహం సక్రమముగా పనిచేయలేదు.

ఉపగ్రహాలు ఢీకొనవా ? : అంతరిక్షంలోనికి నేడు అనేక దేశాలు ఉపగ్రహాలు పంపుతున్నాయి కదా ! మరి అక్కడ వాటి సంఖ్య పెరిగి ఒక దానితోఒకటి ఢీ కొనవా అనే సందేహం ఈ పాటికే వచ్చిందను కొంటాను. కాని ఉపగ్రహాలు ఒక దానితో ఒకటి ఢీకొనే ప్రమాదం లేదు. ఎందుకంటే ప్రతి రెండు శాటిలైట్స్‌కు మధ్య కనీసం వాటి నిర్ధేశిత కక్ష్యలో ఒక డిగ్రీ తేడా ఉంటుంది. అంటే ఓ శాటిలైట్‌కు మరో శాటిలైట్‌కు మధ్య దూరం 700 కి.మీ. లన్న మాట అందుచే ప్రమాదం లేదు.

ఇన్‌శాట్-2 ఇ విశేషాలు : ఫ్రెంచ్ గయానా కౌరూ నుంచి ఏప్రిల్‌లో ప్రయోగించిన ఇన్‌శాట్-2 బరువు 2550 కేజీలు. ఈ ఉపగ్రహంలో 17 సీ బాండ్ లోయర్ ఎక్స్ టెండెడ్ సీ బాండ్ ట్రాన్స్‌పాండర్లను, అత్యధిక స్థిరత్వాన్ని కలిగిన రేడియో మీటర్ కెమెరాల అభివృద్ధి పరచిన రూపాంతరాలను ఇది మోసుకుపోతుంది. ఈ ఉపగ్రహ ట్రాన్స్‌పాండర్లను అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ ఉపగ్రహంనకు లీజుకు ఇస్తారు. ఈ ఉపగ్రహ జీవిత కాలం 12 సం॥లు. రెండవ తరానికి చెందిన ఇన్‌శాట్ లలో చివరిదైన ఈ ఉపగ్రహం ఇప్పటి వరకు నిర్మితమైన వాటికన్నా మెరుగైనది. మూడవ తరమైన ఇన్‌శాట్-3 సీరీస్‌కు ఇది మార్గదర్శకం కానుంది. అందుచే ఇన్‌శాట్-2 ఇ ఇస్రోశాస్త్రవేత్తల కలలను నిజం చేస్తూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఆశిద్దాం. ●

అధ్యాపకదర్శిని-16 సిద్ధంగా వున్నది

1998 సం॥లో విద్యా రంగంనకు సంబంధించి వెలువడిన అన్ని జి.ఓ.లు, అన్ని తరగతుల ఉద్యోగులందరికి ఉపయోగపడే మెడికల్ రీయింబర్స్‌మెంట్, కారుణ్య నియామకాలు, సి.సి.ఎ. రూల్స్‌కు సంబంధించిన జి.ఓ.లతో వెలువడిన సమగ్ర పుస్తకం యిది.

ఆకర్షణీయమైన లామినేషన్ కవరుతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బైండింగ్ చేయబడినది. 360 పేజీలు గల పుస్తకం వెల కేవలం రు. 40/-లు మాత్రమే.

ఇట్లు

ఐక్య ఉపాధ్యాయ ప్రచురణలు

చైతన్య ప్రవంతి

కులనిర్మూలనకు ఏం చేయాలి?

- గుర్రాల శ్రీరామమూర్తి, శానపల్లిలంక

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

ఆంగ్లేయుల కాలంలో కొత్త ఉత్పత్తి సంబంధాలు, కొత్తకార్మికోద్యమ సంబంధాలు నెలకొని బూర్జువా వర్గం, కార్మికవర్గం ఏర్పడ్డాయి. తనకు నచ్చిన ఏ వృత్తినైనా అవలంబించుటకు వీలు చిక్కింది. ఈ విధానం వంశపరంగా వస్తున్న కులవృత్తులపై ఆధారపడింది మాత్రం కాదు. బతుకు తెరువు కోసం కులవృత్తితో సంబంధం లేకుండ కర్మాగారాలలో అన్ని కులాలు కలిసిపనిచేయవలసి వచ్చింది. కులంతో నిమిత్తం లేకుండ అందరు పారిశ్రామిక కార్మికులు, వ్యవసాయ కూలీలు, సంఘటితపడి పోరాటాలు సాగించవలసి వచ్చింది. కులాన్ని పాటించడం తగ్గించుకోవలసిన అవసరం తప్పనిసరైంది.

నేడు పాలకవర్గాలు అనుసరిస్తున్న వ్యవసాయక, పారిశ్రామిక, పరిపాలనా సంబంధమైన విధానాల వల్ల జనంలో కొంత కదలిక వస్తోంది. చదువుకోవడం ఉద్యోగాలు చేయడం జరుగుతోంది. ప్రజలు తమ జీవిత సమస్యలపై పోరాడుతున్నారు. ఎన్నికల్లో పాల్గొంటున్నారు. విద్యార్థులు కలిసిచదువుకొంటున్నారు. వ్యవసాయ కార్మికులు

పారిశ్రామిక కార్మికులు కలిసి ఒకే చోట పనిచేస్తున్నారు. జీవిత అనుభవాల నుంచి, పరిస్థితుల నుంచి నేర్చుకొంటున్నారు. రాను రాను జనంలో రాజకీయ చైతన్యం పెరుగుతుంది. నిమ్నకులాలు కూడా పరిపాలనా సంబందమైన పదవుల్లో భాగస్వాములవుతున్నాయి. ఈ భౌతిక పరిస్థితులలో వచ్చిన మార్పులవల్ల సంప్రదాయక అలవాట్లు, కులకట్టుబాట్లు, అంటరానితనం సడలిపోతున్నాయి. ఇవన్నీ సామాజిక క్రమంలో ఉపరితలంలొ వస్తున్న మార్పులు. ఇవి కులము యొక్క కుదురును బలహీన పరుచుటకు తోడ్పడతాయి. ఈ విధంగా ఆర్థిక అసమానతలు, ఉత్పత్తి విధానం ఆధారంగా వర్గాలు, సాంఘిక తేడాల మూలంగా కులాలు రెండు ఒకదాని సరసన ఇంకొకటి కొనసాగుతున్నాయి. కులాలు వర్గాలుగా, వర్గాలు కులాలుగా విభజితమై ఉన్నాయి. అయినప్పటికి భారత కార్మిక వర్గం రానురానుబలపడుతుంది. ప్రబలమైన సమరశీల శక్తిగా ఎదుగుతుంది.

"సమాజంలో వర్గాలు ఏర్పడడం అనివార్యం. సామాజిక సంపద పంపకంలోని అసమానతలు, వర్గాల మధ్య అంతరాలు విభజనకు దారితీస్తాయి. దాని నుండి అంతరాలను కాపాడుకొనడం, ఎదిరించడం నుండి వివిధ ఆలోచనలు, భావాలు ఏర్పడతాయి. ఈ భౌతిక ప్రవర్తన నుండే రాజకీయాలు, చట్టాలు, నీతి భావాలు, మతతత్వ భావాలు అవిర్భవిస్తాయి" (ఎంగెల్సు)

నిమ్నకులాలకు రాజ్యాంగంలో ప్రత్యేక ప్రాతినిధ్యం (రిజర్వేషన్) పొందుపరచబడింది. అంటరానితనం లేకుండ చేయుటకు చట్టమున్నది. చట్టాలు సరిగ్గా అమలు జరగని అనుభవము మనకున్నది. ఇల్లు అలకగానె పండుగకాదు. చట్టాలు, చేయగానే సరిపోదు. రిజర్వేషన్ వలన కొద్దిమంది ప్రయోజనం పొందుతున్నారు. కొద్దిమందికి రిజర్వేషన్ సదుపాయం అందడం లేదు అందే అవకాశము లేదు. వారి బతుకు ఎదుగూ, బొదుగూ లేదు. దీని ఉపయోగం చాల పరిమితం. ఓదార్పుకు పనివస్తుంది. ఏ మూల సమస్యతీరదు. ప్రజల్లో భ్రమలు కల్పించుటకు, ప్రజలు భ్రమలు పెంచుకొనుటకు పనికి వస్తుంది. ఇంతకాలంగా రిజర్వేషన్ అమలు పరిచిన తర్వాత కూడ నిమ్నకులాలలో తగినంత మార్పేమి రాలేదు.

ఈ కులాలలోనే అంతరాలు పెరిగాయి. అందువల్లనే ఈ కులాలలోనే మాలలు, మాదిగలకు అన్యాయం చేస్తున్నారని, సదుపాయాలు అందకుండ చేస్తున్నారని కలహించుకొంటున్నారు. పొందినవారు నిలుపుకొనుటకు, లేని వారు పొందుటకు ప్రయత్నిస్తున్నారు. పాలకవర్గం వల్ల అన్యాయం, అక్రమం జరుగుతుంటె గుర్తించకుండ తమలో తామే కారణమని వైరం పెంచుకొంటున్నారు. దళితులు సంఘటితపడి ఉద్యమించి ఉమ్మడి సమస్యలైన దారిద్ర్యం, అంటరానితనం, అసమాతలపై పోరాడి వదిలించుకోవలసిందిపోయి, కొద్దిపాటి ప్రయోజనం చేకూర్చగల సదుపాయం కోసం శక్తియుక్తులు ఖర్చుపెడుతున్నారు. ఈ సానుకూల పరిస్థితిని కొన్ని స్వార్థపరశక్తులు వినియోగించుకోకమానవు. పిల్లులు రెండు పోట్లాడుకొంటె కోతికి మేలన్నది వేరే చెప్పనక్కరలేదు.

జరుగుతున్న అన్యాయాలకు, అంటరానితనానికి వ్యతిరేకంగా విడిగా కుల సంఘాల నేర్పరుస్తున్నారు. అగ్రకులాలపై అథమకులా లేకమై కుల పోరాటం చేయాలంటున్నారు. కేవలం కుల పోరాటం వల్ల కుల నిర్మూలన కాస్కారం లేదు. పైగా కులతత్వం పెరుగుతుంది; బలపడుతుంది, నిలబెట్టి ఉంచుటకు తోడ్పడుతుంది. ప్రస్తుత సంఘం, పరిణామక్రమంలో స్థంభించిన అనేక అసమానతలు, విరుద్ధాలతో నిండి సతమతమవుతుంది. ఇవన్నీ పరస్పర సంబంధం కలిగినవే. వదిలించుకోవలసిన తీవ్ర సమస్యలే. కష్టజీవులంతా కలిసికట్టుగా, సంకల్పబలంతో అసమానతలపైన సంఘర్షణ కానరదు. అనాలోచితంగా నైనా, సొంతలాభం కోసమైనా, ఇది జనాన్ని వేరుచేసి ప్రజా ఉద్యమాన్ని బలహీనపరిచే పోకడ. ఇటువంటి బలహీనతల్ని పాలకవర్గాలు చాకచక్యంగా వాడుకొంటాయి. తమ దోపిడీని, పెత్తనాన్ని ఆటంకం లేకుండ సాగించుకొంటాయి. ఉన్న పరిస్థితిని ఎగదోసి ప్రజల్లో వేర్పాటును నిలబెట్టడానికి ప్రయత్నిస్తాయి.

కేవలం జనాభాలో 17% మించని నిమ్నకులాలను (యస్.సి) 8% మించని షెడ్యూలు తెగలను (యస్.టి.) ఒకటిగా కూడగట్టగలిగతే తదితర కులాలలో గల 75% జనాన్ని వ్యతిరేకం చేసుకోవడమే అవుతుంది. అన్ని అనర్థాలకు ఆలవాలమైన పాలక వర్గాలకు వీరిని వదలిపెట్టడమే అవుతుంది. అన్ని కులాలలలోను, మతాలలోను, కులనిర్మూలనకు సాయపడే వ్యక్తులు, శక్తులున్న సంగతి మరిచిపోరాదు. ఈ ఒంటరితనం కులాలను తుడిచి పెట్టుటకు దోహదపడదు. తక్షణ సమస్యలు తీర్చుకోడానికి పనికిరాదు. ఇటువంటి ప్రయత్నాలు గాని ఉద్యమాలు గాని కడకు దారి తప్పినవిగా మిగిలిపోతాయి. ఇప్పటికే చెప్పనలవికానంత హాని జరిగిపోయింది. గతం మాటటుంచి మనదేశంనకు సొంతమైన తర్వాత ఏబైయేళ్ళకాలం ఇలాగే గడిచిపోయింది. ఆపేక్షతో ఎదురుచూస్తె నేడు నిమ్న కులాలలోనే కుమ్ములాటలు బయలుదేరిన పరిస్థితి దాపరించింది.

ఒడిలో, బడిలో కులం, కొలువులో, కార్ఖానాలలో కులం, ఎన్నికల్లో చట్ట సభల్లోకులం, అప్పుకి, ముప్పుకి కులం, దేని కోసం దరఖాస్తు పెట్టాలన్నా కులం, మతం రాస్తే గాని చెల్లనే రదు. అంటరానితనం నేరమని పుస్తకంపై చూడగలం. కులం కూడదని పాలికేక వినిపిస్తుంది.

కుల మతాలను పెంచిపోషించడం కనిపిస్తుంది. కొన్ని పేటలు, పాఠశాలలు నేటికి కులం పేర్లతో చల్లగా వర్ధిల్లుతూనే ఉన్నాయి. ఆఖరికి కులం, మతం మనిషికి తోడు నీడై నడిపిస్తున్నాయి. వీటన్నిటిని బాగా వాడుకొంటు పాలకవర్గం తమ అధికారాన్ని వర్గ ప్రయోజనాలను కాపాడుకొంటుంది. అందుకే ప్రస్తుత పరిస్థితిని కొనసాగిస్తుంది. దళిత సంఘాలు తమ పొరపాట్లను గుర్తించుట లేదు. కార్మిక వ్యతిరేకతను వదలడమూ లేదు. ఈ సమస్యకు వర్ణపోరాటం విరుగుడు కాదు. వర్గపోరాటమే మనముందున్న పరిష్కారం. అందుకొరకు జనంలో తగినంత చేతనత్వం తెచ్చి కదిలించాలి.

కులాలను తుడిచిపెట్టాలనే వారి ఆగ్రహం సరైనదే. ఆగ్రహం ఆవేశం ఉంటేనె సరిపోదు. తిన్నగా ఆలోచించాలి. ఆకళింపు చేసుకోవాలి. సాధించడానికి సరైన దారి వెతకాలి. వైద్యం చేయడానికి ముందు రోగనిర్ధారణం చేయాలి. లేకపోతే దేనిదారి దానిదే అవుతుంది. స్వతంత్ర పోరాటంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం అంతర్భాగం కావలసిన అవసరాన్ని ఉద్దేశపూర్వకంగానే వదిలివేయబడింది. ఆనాటి సంస్కరణ ఉద్యమాలన్నీ ఈ సరిహద్దు దాటలేక పోయాయి. భూస్వామ్య, ఆర్థిక సంబంధాలను విస్మరించాయి. అందువల్లనే మూలమును పెకలించుటకవి పనికి రాలేదు. ఉపచర్యల వల్లనంతగా ఉపయోగముండదు. కొన్ని కులాల జీవితం అవస్థల పాలైతె, మరికొన్ని సంపదలతో తులతూగుతున్నాయి. ఈ వ్యవస్థను పదిలంగా ఉంచి ఏదో ఒరగబెడదామనుకొన్నా జరిగేది కాదు. ఒరిగి పడుతుందని నమ్ముకొన్నా తీరేది కాదు. ఒక పక్క ఆస్తి, పెట్టుబడి పోగవుతుంటె, ఇంకొక పక్క దారిద్ర్యం, నిరుద్యోగం పోగవుతున్నాయి. నిరుపేదలకు కనీసం కూడు, గుడ్డ, కొంప సమకూర్చుకొనే ఆధారం లేదు. కులమత భేదాలతో, బానిస భావాలతో, ఆర్థిక అసమానలతో సంఘం చిన్నా భిన్నం చేయబడింది. తరతరాలుగా సాగుతున్న ఈ వ్యత్యాసాలు మనం చూస్తూనే ఉన్నాం. ఇందుకు కారకులెవరో, కారణాలేమిటో కనిపెట్టాలి. సరియైన నిర్ణయాలు చేయాలి తగిన విధంగా పాటుపడి చక్కదిద్దాలి.

కులం, మతం ఒక సామాజిక ఉత్పత్తి విధానంతో ముడిపడి ఉన్నాయి. నిరుపేదలు అప్పులపై ఆధారపడినందున వంశపరంగా కట్టు బానిసత్వం వచ్చింది (వెట్టిచాకిరి) సామాజిక అసమానతలున్నప్పటికి, అంటరాని వారి యొక్క, శ్రామికుల యొక్క కులాలు, ఉపకులాలుగా ఉన్న సమస్య, సామాన్యంగా భూమి లేమి, నిరుద్యోగం సమస్య. ఈ రెండు పెట్టుబడిదారీ సమాజంలో అన్ని తరగతులు దరిద్రులుగా మారే సమస్యతో విడదీయరాని లంకె పడి ఉన్నాయి. దళితులు అత్యాచారాలకు, దాడులకు గురవుతున్నారు. ఇందుకు వారి ఆర్థిక పరిస్థితి, అప్పుల బాధ, కనీస వేతనం లేక కూలి యివ్వకపోవడం, భూపరిమితి చట్టాలు అమలు జరపకపోవడం కారణాలు. అన్ని రకాల వెనకబడి, నలిగిపోయిన నిరుపేదలే నేటికి శ్రమ, కూలి, వేతనం, కౌలు వెట్టిచాకిరి, భూమి తగాదాల దురాగతాలకు బలవుతున్నారు. షెడ్యూలు కులాల, తెగల కమిషన్‌కు ఇటువంటి దురాగతాలకు కారణాలు 32% పోటీలు తెలిసికొనుట కష్టమైంది. 68% వాటిలో ప్రధానమైన కారణం భూమి వివాదమే అని తేల్చింది. సాంఘిక సంబంధాలలో వచ్చే మార్పులే ఘర్షణలకు, వివాదాలకు దారితీస్తాయన్న సంగతి మనం గమనించాలి.

నేడు భూస్వామ్య వర్గాలతో రాజీపడిన వర్గాలే అధికారంలో కొనసాగడం వల్ల భూసంస్కరణలు అమలు జరగడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల పెత్తనం నశించలేదు. భూస్వామ్యుల దౌర్జన్యం, పెత్తనం, సంపద కూలదోసె, పెదప్రజల జీవితాలను బాగుపరచాలంటె, అటువంటి మార్పు తీసుకురావడానికి ఆసక్తిగల అన్ని శక్తులు కలిసి పోరాటం చేయవలసిన అవసరముంది. కేవలం కొన్ని కులాలు ఏకమై సాధించుకొందామన్నా కుదరదు. కుల, మత, ప్రాంతం, భాషా విభేదాలు వదలిపెట్టి కష్టజీవులంత ఒక్కటై పాటుపడితేనె భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజం వదులుతుంది. అసమానతలు, అంటరానితనం రద్దవుతాయి.

దేశంలో కులతత్వం, మతతత్వం రద్దు కాకుండ నిజమైన ప్రజాస్వామ్యం గాని, లౌకికతత్వంగాని ఉండవు. కులనిర్మూలన కోసం జరిగే పోరాటం ప్రజాతంత్ర పోరాటంలో భాగం కావాలి. అన్ని కులాలలోని పీడిత జనాన్ని ఏకంచేయాలి. సంఘటిత పరచాలి. కులనిర్మూలనపట్ల ఆసక్తి గల వ్యక్తుల, శక్తుల, సంస్థల తోడ్పాటు పొందాలి. గతంలో దీనికి భిన్నంగా జరిగినందునే కులవ్యతిరేక పోరాటాలు నెరవేరలేదు. ఈ వాస్తవాన్ని మనం గుర్తించవలసి ఉంది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ పోరాటంతో కులవ్యతిరేక పోరాటం జోడించాలి, ఏక కాలంలో సాగించాలి. వర్గాలు ఆధారంగా, సమస్యల ఆధారంగా ఏర్పడే ప్రజా సంఘాల వల్ల కుల వ్యవస్థ బలహీన పడుతుంది. రద్దు పరచవీలవుతుంది. ఈ కర్తవ్యం విజయవంతంగా కార్మికవర్గం నెరవేర్చగలుగుతుంది.

సామాజిక పరిస్థితులే మనిషికి చేతనత్వాన్నిస్తాయి. సామాజిక పరిస్థితులు మారనంత వరకు ఈ వ్యవస్థ అంతం కాదు. పునాదియైన భూస్వామ్య సంబంధాలపై దెబ్బ కొట్టాలన్నా, సామాజిక వ్యవస్థను సమూలంగా మార్చి వేయాలన్నా రాజ్యాధికారం కావాలి. అధికార సమస్యను మరచిపోడానికి వీలు లేదు. ఎందుకంటే సామాజిక అభివృద్ధిలో ప్రతిదానిని నిర్ణయించేది అధికారమే. అందుకే కష్టజీవులు అధికారం లాక్కోవాలి. అప్పుడు స్వార్థ మెరగని, సమర్థవంతమైన కార్మిక వర్గం చేతిలో అధికారముంటుంది. కనుక సాంఘిక, ఆర్థిక, విద్య, విజ్ఞాన రంగాలలో పెనుమార్పులు తెచ్చుటకు వీలు చిక్కుతుంది. సామాజిక పరివర్తన నిరాటంకంగా వేగిరపరచుటకు అవకాశంమెండుగా ఉంటుంది. వర్గాలు రద్దవుతాయి. దోపిడి ఆగిపోతుంది. దున్నే వానికి భూమి దక్కుతుంది. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు తొలగించబడతాయి. ప్రజలలందరి అవసరాలు తీరతాయి. అణగారిన జనం రాజకీయాలలో చురుకుగా పాల్గొంటారు. సమాజంలో, పరిపాలనలో స్వేచ్ఛగాను, స్వతంత్రంగాను జీవించగలుగుతారు. ఇవన్నీ ఉన్నపళంగా ఒన గూడవు. సమకూర్చడానికి కొంత సమయం పడుతుంది. ఇంతవరకు పాలకవర్గాలు రాజ్యాధికారం, రాజ్యాంగ యంత్రం, అన్ని రకాల కళలు, ప్రసార సాధనాలను పెద్ద ఎత్తున తమకనుకూలంగా వాడుకొని, కుల మతాలను బలపరిచి, స్థిరపరిచాయన్న సంగతి ఎన్నడు మరిచిపోరాదు.

కాబట్టి ఐకమత్యంతో, సంఘటిత శక్తితో విప్లవించినపుడే కులాన్ని కూకటి వేళ్ళతో పెకలించడం సాధ్యపడుతుంది. కులాలు కొనసాగుటకుగల పరిస్థితులు తారుమారవుతాయి. ప్రజలంతా కష్టపడి పనిచేసి, సుఖవంతంగా జీవించగల సమసమాజం సాధించబడుతుంది. ప్రస్తుత వ్యవస్థ రద్దయిన వెంటనే కులం నిర్మూలన కాదు. జనంలో ఉన్న పాత అలవాట్లు, భావాలు, అభిప్రాయాలు ఒకసారి మటుమాయం కావు. తరతరాలుగా జీర్ణించుకుపోయిన కుల, మత, భావాలు పూర్తిగా తుడిచిపెట్టి వేయుటకు చాలాకాలం పడుతుంది. అంతవరకు ఓపికగా భావ విప్లవ పోరాటం ఎడతెరిపి లేకుండా కొనసాగించవలసి ఉంటుంది. ఆ విధంగా కులం క్రమంగా అంతరించిపోతుంది. ●

మనలో మనం

మంచిరోజు

- కె. శ్రీనివాసులు, ఖమ్మం

తన కుమార్తెకు పెళ్ళి సంబంధం చూడడానికి ఒక గ్రామం వెళ్ళే సందర్భంలో నన్ను కూడా రమ్మని నా మిత్రుడడిగాడు. మంగళవారమైతే నాకు సెలవు పెట్టడానికి వీలవుతుందని చెప్పాను. "ఆ రోజైతే వద్దు, అన్ని వారాల్లోకి మంగళవారం చాలా ప్రమాదకరమైంది. ఆ రోజు ప్రయాణం చేయకూడదు" అని నా మిత్రుడన్నాడు. "మంగళ" అంటే శుభప్రదమని అర్థం కదా ! మరి ఆ రోజు మంచిది కాకపోవడమేమిటి అని అడిగా, "ఏమో అదంతా తెలియదు. మంగళవారం ప్రయాణం చెయ్యకూడదని పెద్దవాళ్ళు చెబుతుంటారు. అందుకని నీకు వీలైన మరో రోజు చెప్పు" అన్నాడు. నా వీలును చూసుకుని మరో రోజు చెప్పా "అయ్యా ఆ రోజు చవితికదయ్యా ! చవితి సాగనియ్యదంటారు. చూస్తూ చూస్తూ శుభకార్యానికి చవితినాడెలా వెళతాం ?" అన్నాడు. అయితే నాకు ఆ రోజు తప్ప సమీప కాలంలో వీలుదొరకలేదు. అప్పుడు మా మిత్రుడు క్యాలెండర్ చూసి "ఆ రోజు ఉదయం గం॥ 11-30 నిమిషాల వరకు చవితి ఉంది. ఆ తర్వాత పంచమి వస్తుంది కాబట్టి 11.30 తర్వాత బయలుదేరుదాం" అన్నాడు. ఆ మరుసటి రోజు ఉదయమే నాకు అత్యవసరమైన పని వుంది. ఎట్టి పరిస్థితుల్లోను ఆ రోజు రాత్రికే తిరిగి రావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పగా అలాగే లెమ్మని ప్రయణాన్ని ఖాయపర్చాడు నా మిత్రుడు.

ఒక క్యాలెండర్‌కు, మరో దానికి నిమిషాల్లో తేడా వుందో ఏమో, ఎందుకైనా మంచిదని నా మిత్రుడు మధ్యాహ్నం 12 గం॥లకు బయలుదేరాడు. దీంతో మేం ఎక్కాల్సిన బస్సు వెళ్ళిపోయింది. ఆ రూట్‌లో కొంతదూరం వరకు వెళ్ళే బస్సు ఎక్కి అనుకున్న చోట దిగాం. అక్కడి నుండి కూడా కావలసిన బస్సు దొరక్కపోవడం చేత మరికొంత దూరం లారీలో ప్రయాణం చేసి, చిన్న పట్టణానికి చేరుకున్నాం. అక్కడి నుంచి మేం వెళ్ళాల్సిన గ్రామానికి వెళ్ళే బస్సు అంతకుముందే వెళ్ళిందని, రాత్రి 8 గంటల దాకా మరో బస్సు లేదని తెలియడంతో మళ్ళీ లారీని ఆశ్రయించక తప్పలేదు. అదైనా, ఆ గ్రామానికి డైరెక్ట్‌గా వెళ్ళే లారీకాకపోయినా, ఆ వైపుగా మరికొంత దూరం ప్రయాణం చేసి ఒక వూళ్ళోదిగాం. అక్కడికి మా గమ్యస్థానం 'ఐదు' కిలోమీటర్ల దూరంలో వుంది. అప్పటికే సూర్యాస్తమయమైంది. సైకిళ్ళపై వెళదామనుకున్నాం. కానీ ఎక్కడా సైకిళ్ళు దొరకలేదు. నడిచిపోతే మళ్ళీ రాత్రికి తిరిగి రాలేమనే వుద్దేశ్యంతో గత్యంతరం లేక అతి సమీపానికి వెళ్ళి కూడా గమ్యానికి చేరుకోకుండానే తిరుగు ప్రయాణమై రాత్రి 12 గంటలకు ఇంటికి చేరుకున్నాం.

చవితి సాగనియ్యదని, పంచమి వచ్చే దాకా వుండి , మంచి మూహుర్తం చూసుకుని బయలుదేరితే మా ప్రయాణం ఏమైంది ? ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి గమ్యానికి 5 కి.మీ. దాకా వెళ్ళి, వెనక్కి తిరిగి రావలసి వచ్చింది కదా ! చవితి అని అనుకోకుండా ఉదయమే గనక మేం బయలుదేరి వుంటే గమ్యానికి చేరి, పని పూర్తి చేసుకొని వచ్చేవారమే గదా ! పంచమి మాకు ఒరగబెట్టిందేముంది ? కనుక మన పనులు కావడానికి, కాకపోవడానికి భౌతిక పరిస్థితులే కారణం గాని, బయలు దేరిన ముహూర్తం కాదనేది వాస్తవం.

నా మిత్రుడు లాంటి చదువుకున్న వాళ్ళు కూడా అనేక మంది మంచిరోజు, చెడ్డరోజనే నమ్మకాన్ని కలిగి వుండడం సాధారణమైంది. కాని అలా నమ్మే వారు తమ నమ్మకంలోని ఔచిత్యాన్ని ఒకసారి మదింపు చేసుకుంటే అది మూఢనమ్మకం తప్ప వేరుకాదని రుజువవుతుంది.

ముహూర్తాన్ని నమ్మే వారంతా ఏదైనా కొత్త పని ప్రారంభించేటప్పుడు 'మంచిరోజు' చూసుకుని ప్రారంభిస్తారు కదా! అలాంటి ఒకానొక 'మంచిరోజు'న దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మంది తాము కోరుకున్న పనులను ప్రారంభించారనుకుందాం. అది మంచి రోజు కనుక, అందరూ వారి కార్యసాధనలో ఖచ్చితంగా విజయాలు సాధించి తీరాలి కదా ! కానీ అలా జరగడం లేదే ఇరుగు - పొరుగు వారిలోనే ఒకరి పని విజయవంతమైతే మరొకరి పని విఫలమవడం మనం చూస్తున్నాం. తిధి, వారంలో గొప్పతనముంటే ఆ తేడా ఎందుకు వస్తున్నది ?

మంచి రోజనుకున్నవాడు ఎలాగైతే కొందరు అపజయాలు, దుఃఖాల పాలవుతున్నారో, చెడ్డరోజనుకున్న నాడు కూడా మరికొందరు విజయాలు, సుఖాలు పొందడం జరుగుతున్నది. నా మిత్రుడి వాదన ప్రకారం మంగళవారం నాడు, చవితి, అష్టమి, తిథుల్లో ఎవరూ ప్రయాణం చెయ్యడం లేదా ? ఆ రోజుల్లో బస్సులు, రైళ్ళు ఖాళీగా వుంటున్నాయా? అలా ప్రయాణాలు చేసిన' వారంతా కష్టాల పాలవుతున్నారా ? అదే నిజమైతే అసలు మూహూర్తాలను నమ్మని వాళ్ళు వుండే అవకాశం లేదు కదా !

మరో విషయమేమంటే మతాలను బట్టి మూహూర్తాలు కూడా మారుతుంటాయి. హిందువులు చెడ్డరోజుగా భావించినది, మహమ్మదీయులకో, క్రైస్తవులకో మంచి రోజు కావచ్చు. అలాగే వారు చెడ్డరోజుగా భావించినది హిందువులకు మంచిరోజు కావచ్చు. అయితే మంచి, చెడు అనేది రోజులో వుంటే అది అందరిపైనా సమానంగా ప్రభావం చూపాలి. అంతేగాని మతాలను బట్టి నమ్మకాలను బట్టి మారకూడదు కదా !

సంప్రదాయకం ప్రకారం జరిగే పెళ్ళిళ్ళన్నీ పండితులు నిర్ణయించిన శుభముహూర్తాల్లోనే జరుగుతుంటాయి. కానీ మంచి రోజున, మంచి మూహుర్తంలో పెళ్ళిళ్ళు జరిగినప్పటికీ కొద్ది కాలంలో కొందరి దాంపత్యాలు విఫలం కావడం మనం చూస్తున్నాం. వినడానికి బాధగా వున్నా, మరికొన్ని సందర్భాలలో మంచి మూహుర్తంలో వేదోక్తంగా పెళ్ళి జరిగిన కొన్ని గంటల్లోనో, రోజుల్లోనో భార్య గానీ, భర్తగాని లేక ఇద్దరూ గాని మరణించిన సంఘటనలూ వున్నాయి. కనుక శుభమూహూర్తాలు అనర్థాలను నిరోధించలేవని రుజువవుతున్నది.

వశిష్ట మహాముని అంతటివాడిచేత నిర్ణయించబడిన శుభ మూహూర్తంలో సీతారాముల కళ్యాణం వేదఘోషల మధ్య జరిగింది. కానీ వారేమాత్రం సుఖపడ్డారు ? ఏ స్త్రీ అయినా కష్టాలు పడుతుంటే "ఆమెకు సీతమ్మోరి కష్టాలొచ్చినాయ' ని కష్టాలకు ప్రతీకగా సీతను ఉదహరించడం జరుగుతున్నదంటే ముహూర్త బలం సీతను ఏ మాత్రం సుఖపెట్టిందో అవగతం కాగలదు.

అంతేగాక గట్టి నమ్మకస్తులకు కూడా మంచి రోజు చూడ్డం అన్ని సందర్భాలలోను సాధ్యం కాదు. ఎవరికైనా గుండెపోటు, 24 గంటల కడుపునొప్పి లాంటి తీవ్రమైన జబ్బు వస్తే మంచిరోజు కాదని, మంచి ఘడియలు కావని పేషెంట్‌ను హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళడంలో ఆలస్యం చేస్తే జరిగే ప్రమాదం ఏమిటో ఊహించలేనిది కాదు. తిథులు, నక్షత్రాలు, వారాలు గ్రహగతులను బట్టి ఏర్పడతాయనే కారణంతో కొంతమంది ఈ మూహూర్తాలకు శాస్త్రీయతను అపాదించాలని ప్రయత్నిస్తారు. కోట్లాది కిలోమీటర్ల దూరంలో గల గ్రహాల ప్రభావం ఒకానొక సమయంలో మనపై పడడం గనుక వాస్తవమైతే మతాలతో కులాలతో, నమ్మకాలతో పని లేకుండా సర్వమానవాళిపై సమానంగా పడాలి. కానీ అలా జరగడం లేదనేది అందరూ ఎరిగిన సత్యం. కనుక ఏ తిథులు, వారాలు చూడకుండా కొందరు అన్ని పనులూ సజావుగా చేసుకుపోతున్న వాస్తవాన్ని గ్రహించి అందరూ ముహూర్తపు చాదస్తాలను విడనాడడం అవసరం.

తెలుసుకుందాం!

ఇప్పటి వరకు 'భారత రత్న' అందుకున్నవారు

వ.నెం.	పేరు	సం॥
1)	చక్రవర్తుల రాజగోపాలాచారి	1954
2)	డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్	1954
3)	డా॥ సి.వి. రామన్	1954
4)	డా॥ భగవాన్‌దాస్	1955
5)	డా॥ యం. విశ్వేశ్వరయ్య	1955
6)	జవహర్‌లాల్ నెహ్రూ	1955
7)	గోవింద వల్లభ్‌పంత్	1957
8)	డా॥ డి.కె. కార్వే	1958
9)	డా॥ బి.సి. రాయ్	1961
10)	పురుషోత్తందాస్ టాండాన్	1961
11)	డా॥ బాబూ రాజేంద్రప్రసాద్	1962
12)	డా॥ జాకీర్ హుస్సేన్	1963
13)	డా॥ పి.వి.కానే	1963
14)	లాల్‌బహదూర్ శాస్త్రి (మరణాంతరం)	1966
15)	ఇందిరాగాంధీ	1971
16)	వి.వి. గిరి	1975
17)	కె. కామరాజ్‌నాడార్ (మరణాంతరం)	1976
18)	మధర్ థెరిస్సా	1980
19)	ఆచార్య వినోభాబావే	1983
20)	ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్	1987
21)	యం.జి. రామచంద్రన్ (మరణాంతరం)	1988
22)	బి.ఆర్. అంబేద్కర్ (మరణాంతరం)	1989
23)	నెల్సన్ మండేలా	1990
24)	మొరార్జి దేశాయ్	1990
25)	రాజీవ్‌గాంధీ (మరణాంతరం)	1991
26)	సర్దార్ వల్లభాయ్ పటేల్ (మరణాంతరం)	1991
27)	సుభాష్ చంద్రబోస్ (మరణాంతరం)	1992
28)	మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ (మరణాంతరం)	1992
29)	జె.ఆర్.డి. టాటా	1992
30)	సత్యజిత్‌రాయ్	1992
31)	అరుణా అసఫ్ ఆలి	1997
32)	గుల్జారీలాల్ నందా	1997
33)	ఎ.పి. అబ్దుల్ కలాం	1997
34)	యం.యస్. సుబ్బులక్ష్మి	1998
35)	డా॥ సి. సుబ్రమణ్యం	1998
36)	జయప్రకాశ్ నారాయణ్ (మరణానంతరం)	1998
37)	శ్రీ అమర్త్యసేన్	1999
38)	పండిట్ రవిశంకర్	1999
39)	గోపినాధ్ బోర్డాలాయ్	1999

బదిలీలు కావాలా?

1) కృష్ణా జిల్లాకు : 1) పి. శారద, సె.గ్రే. కడియం మం॥, తూ॥ గో॥ జిల్లా

2) సి.హెచ్. కృపావతి, సె.గ్రే. పిట్టువారిపాలెం, చీరాల మం॥, ప్రకాశం జిల్లా.

3) కె. బసంతిబాయ్, సెగ్రే, తిప్పరాజుపాలెం, కాజులూరు మం॥, తూ॥ గో॥ జిల్లా

4) యం.డి. షమీమ్, సెం.గ్రే. రామనగరం, మాచారం (పోస్ట్) సత్తుపల్లి మం॥, ఖమ్మం జిల్లా

2) ఖమ్మం జిల్లాకు : 1) యం. వాసంతి, సె.గ్రే, చందాపూర్, సదాశివపేట మం॥, కృష్ణా జిల్లా

3) గుంటూరు జిల్లాకు : 1) బి. రాణి, సె.గ్రే, లంకమాలపల్లి, గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా.

4) ప్రకాశం జిల్లాకు : బి. రామచంద్రారెడ్డి, సె.గ్రే, భూపతిపాలెం, అనాకాపల్లి మం॥, విశాఖ జిల్లా

5) కడప, చిత్తూరు జిల్లాలకు : యం. రాజేంద్రనాయుడు, బి.యస్.సి., బి.యిడి. పాల్తేరు, పాయకరావుపేట మం॥, విశాఖ జిల్లా

6) తూర్పు గోదావరి జిల్లాకు (లేదా కాకినాడ మున్సిపాల్టీకి) : భాట్ రామ్‌సింగ్, సె.గ్రే, యు.పి. స్కూలు, కొత్తపేట, విజయవాడ, కృష్ణా జిల్లా.

7. ప॥ గోదావరి జిల్లాకు : 1) వై. శ్రీనివాసులు, సె.గ్రే. యం.పి. స్కూలు, చళ్ల , రామకుప్పం మం॥, చిత్తూరు జిల్లా

2) పి. చిట్టిబాబు, సె.గ్రే. బాసవ కొత్తూరు, బాలగం, (పోస్ట్) కవిటి మం॥, శ్రీకాకుళం జిల్లా

3) జి. శ్రీనివాస్, సె.గ్రే, ఆర్.బాలగమ్, కవిటి మం॥ శ్రీకాకుళం జిల్లా

4) జి. సత్యసుబ్రహ్మణ్యశాస్త్రి, గ్రే-2 తె.పం.జి.ప. హైస్కూలు, పడమటి పాలెం, మలికిపురం మం॥, తూ॥ గో॥ జిల్లా.

8. విశాఖపట్నం జిల్లాకు : డి. కమలాకుమారి, సె.గ్రే, బిళ్ళనందూరు, కోటనందూరు మం॥ తూ॥ గో॥ జిల్లా

9. విజయనగరం జిల్లాకు : 1) చిన్న మంగదేవి, సె.గ్రే, సుభద్రాపురం, కౌతారం, కపిలేశ్వరపురం మం॥, తూ॥ గో॥

2) కొల్లి జగన్నాధం, సె.గ్రే, చిక్కాల (వయా) తాడిమళ్ళ, చాగల్లు మం॥, ప॥ గో॥ జిల్లా

3) పి. నీరజ, అప్రంటీస్, టీచర్, మాడుగుల మండలం, విశాఖపట్నం జిల్లా

10. రంగారెడ్డి జిల్లాకు : 1) కె.వి. పద్మశ్రీ, సె.గ్రే దాచవరం, వీరులపాడు మం॥ కృష్ణా జిల్లా.

11. మెదక్ జిల్లాలకు : ఏ.వి.యస్. నాగమణి, సె.గ్రే, అప్రంటీస్, తాళ్ళకుప్ప, పోలవరం మం॥, తూ॥ గో॥ జిల్లా.

12. హైద్రాబాద్ జిల్లాకు : యం. రామమణి, బి.యిడి., సైన్స్ అసిస్టెంట్, యు.పి.యస్, బొడ్డపాడు, తోట్లవల్లూరు మం॥ కృష్ణా జిల్లా.

13. నల్గొండ జిల్లాకు : పి.లక్ష్మి, సె.గ్రే., తెలుగు పండిట్, యు.పి.యస్., మిట్టపల్లి, తల్లాడ మండలం, ఖమ్మంజిల్లా.

హైదరాబాదు భవననిధి

గత నెలవరకు ప్రకటించినది	23,36,662-00
శ్రీ ఎ. నాగేశ్వరి, నల్లకుంట, హైద్రాబాదు	200-00
శ్రీమతి యన్. సూర్యకాంతం, సఖినేటిపల్లి, తూ.గో.	116-00
శ్రీ పి. సత్యనారాయణ, రిటైర్డు, టీచరు, వైరా, ఖమ్మం	2,000-00
విద్యవిషయక విభాగము నుండి	40,000-00
మొత్తం	23,78,978-00

ఆందోళనలు - అధికారులతో చర్చలు

గుంటూరు : గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని తలపెట్టిన ఉపాధ్యాయ సంఘాల కార్యాచరణ కమిటీతో 17-2-99న కమిషనర్ శ్రీ కృష్ణబాబు చర్చలు జరిపి జీతాలు ప్రతి నెలా 1వ తేదీకి అందేట్లు చేస్తానని, ఉపాధ్యాయులు చనిపోయినపుడు అంత్యక్రియల ఖర్చులు వెంటనే అందచేస్తామనీ, ప్రతి 3 నెలలకు కోఆర్డినేషన్ సమాశాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. చర్చలలో యు.టి.యఫ్. పక్షాన శ్రీ సిహెచ్.వి. బ్రహ్మం, శ్రీదర్. వి.ఎస్. శర్మ, శ్రీ కె. వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు

కాకినాడ : కాకినాడ మున్సిపల్ కమిషనర్‌తో 8-2-99న అక్రమ బదిలీలు రద్దు, కో-ఆర్డినేషన్ మీటింగ్ తదితర 16 అంశాలపై చర్చలు జరిగాయి. సమస్యల పరిష్కారానికి కమిషనర్ శ్రీ వి. దుర్గాదాస్ అంగీకరించారు. చర్చలలో సంఘపక్షాన శ్రీ వి. సత్యనారాయణరాజు, శ్రీ జె. అప్పారావు, శ్రీ సిహెచ్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ది 6-2-99న కాకినాడ అర్బన్ రేంజ్ డి.ఐ. శ్రీ సిహెచ్. సుబ్బారావు గారితో చర్చించి టి.ఏ. సెంటర్ల పునరుద్ధరణ ఎయిడెడ్ వారికి 1933 లీవ్ రూల్సు వర్తింపచేయుట తదితర సమస్యలు పరిష్కరించుట జరిగినది.

మామిడికుదురు : మామిడికుదురు మండలంలోని 26 సమస్యలపై యు.టి.యఫ్. మండలశాఖ ఇచ్చిన నోటీసు మేరకు ది. 26-2-99న ఎం.పి.పి. శ్రీమతి శేషారత్నం, ఎం.ఇ.ఓ. శ్రీ నాగేశ్వరరావు, ఎం.పి.డి.ఓ. శ్రీ నందేశ్వర రావుల సమక్షంలో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ పొందారు. ఈ కార్యక్రమంలో యుటి.యఫ్. మండల శాఖబాధ్యులు శ్రీయుతులు వై. శ్రీరామమూర్తి, కె. సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, కాశీవిశ్వేశ్వరరావు, కేశవరావులు పాల్గొన్నారు.

శ్రీ సి. నాగేశ్వరరావు గారి అక్రమ బదిలీ రద్దు చేస్తూ పూర్వం స్థానములో కొనసాగించాలని హైకోర్టు తీర్పు

గుంటూరు జిల్లా చుండూరు మండల యు.టి.యఫ్. శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. నాగేశ్వరరావు గారిపై స్థానిక అధికారులు రాజకీయ నాయకులు అసత్య ఆరోపణలతో పెట్టిన పిటీషన్ ఆధారంగా జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. ఆయనను ఏకపక్షంగా మరో మండలానికి బదిలీ చేశారు. దానిపై ఆయన ఆం॥ప్ర॥ ట్రిబ్యునల్‌లో కేసు వేయగా ట్రిబ్యునల్ దానిని తిరస్కరించింది.

శ్రీ నాగేశ్వరరావు గారు పట్టు విడవక తిరిగి హైకోర్టులో రిట్ వేయగా జస్టిస్ బి. సుభాషణ్ రెడ్డి, జస్టిస్ వై.వి. నారాయణలతో కూడిన డివిజన్ బెంచ్ సి.ఇ.ఓ. ఉత్తర్వును, ట్రిబ్యునల్ ఉత్తర్వును రద్దు చేస్తూ మార్చి 22న తీర్పు చెప్పినది.

జి.ఓ. 205 విద్య, తేది : 6.7.98 ప్రకారము జిల్లాస్థాయి కమిటి ఉపాధ్యాయులను బదిలీ చేయు అధికారము కలిగివుండగా కేవలం సి.ఇ.ఓ. ఒక్కరే అట్టి బదిలీ చేయుట చెల్లదని చెప్తూ శ్రీ నాగేశ్వరరావు గారిని చుండూరు మండలంలోని పూర్వపు స్థానానికి బదిలీ చేయవలసిందిగా హైకోర్టు ఆదేశించింది.

చుండూరు మండల పరిషత్ అధికారులు ఆడిట్ ఖర్చని మరో ఖర్చని ఉపాధ్యాయుల నుండి వేలాది రూపాయలు వసూలు చేయడాన్ని యు.టి.యఫ్. బాధ్యుడుగా శ్రీ నాగేశ్వరరావు వ్యతిరేకించారు. దాని ఫలితమే యీ అక్రమ బదిలీ అయితే న్యాయానికి అంతిమవిజయం లభిస్తుందనే దానికి యిదొక ఉదాహరణ.

మొగల్తూరు యం.పి.డి.ఓ.పై చర్య తీసుకోవాలి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా అవినీతికి, అక్రమాలకు పాల్పడుచున్న, ప.గోదావరి జిల్లా మొగల్తూరు యం.పి.డి.ఓ.పై తగిన చర్య తీసుకొనవలసినదిగా మండల యు.టి.యఫ్. శాఖ డిమాండ్ చేస్తోంది.

గ్రామాలలో ఉపాధ్యాయులకు - ప్రజలకు, రాజకీయ నాయకులకు - ఉపాధ్యాయులకు మధ్య మనస్పర్థలు సృష్టించుచున్న యం.పి.డి.ఓ. శ్రీమతి జి. పద్మగారు ఎంతోకాలం నుండి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా, చాటుమాటుగా వెళ్ళిన వారి పనులు చేస్తూ, అవినీతికి పాల్పడుచున్నారు. ఆమె విధానాలకు నిరసనగా 1998-99 సం॥లలోని జన్మభూమి కార్యక్రమాలను ఉపాధ్యాయులు బహిష్కరించి, 8-1-98న మండల కార్యాలయం ఎదుట 400 మంది ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించారు. అప్పటికి స్పందించని యం.పి.డి.ఓ. స్థానిక ముఖ్యులు వత్తిడి వలన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశములో ఆమె వాడిన పదజాలం సభ్యసమాజం తలదించుకునే విధంగా వున్నది. ఈ పరిస్థితులన్నీ ఏకరుపెడుతూ ఉపాధ్యాయుల జిల్లా కలెక్టరు గార్కి విజ్ఞాపన పత్రాన్ని అందజేసిరి.

కలెక్టరుగారు ఆమెపై విచారణకు అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చిరి. అధికారులు యం.పి.డి.ఓ. చేత, సెలవు పెట్టించారు. యం.పి.డి.ఓ.పై సమగ్ర విచారణ జరిపి, తగిన చర్య తీసుకొనవలసినదిగా, మండల శాఖ కోరుచున్నది.

కాట్రేనికోన - విద్యాగోష్ఠి

7.3.1999వ తూ.గో. జిల్లా కాగ్రేనికోనలో 70 మంది ఉపాధ్యాయులతో విద్యాగోష్ఠి నిర్వహించబడినది. సదరు గోష్ఠికి శ్రీ బి. అశోక్ అధ్యక్షత వహించారు.

జి. ఆంజనేయులుగారు, ప్రభుత్వ పథకాలు, వాటి అమలుపరచు విధానంపైన, పి. కృష్ణంరాజు, రామకృష్ణంరాజు గార్లు యు.టి.యఫ్. ఉద్యమచరిత్ర గురించి, శ్రీ ఆర్. వీరాస్వామి ఉద్యమ నిర్మాణం గూర్చి మాట్లాడిరి.

వినుకొండలో ప్రాంతీయ సమావేశం

గుంటూరుజిల్లా వినుకొండలో ప్రాంతీయ సమావేశం జి జాన్ గారి అధ్యక్షతన జరిగినది. జిల్లా కార్యదర్శి ఏ. నాగేశ్వరరావు జిల్లా రిపోర్టును వివరించిరి. రాష్ట్ర కౌన్సిలర్ శ్రీ బి. కొండయ్య ప్రభుత్వానికి, ఉపాధ్యాయ సంఘాల మధ్య జరిగిన చర్చల వివరాలు తెలిపారు. సర్వీస్ రిజిష్టర్లను ప్రారంభించు ఉపాధ్యాయుల నుండి, విద్యాశాఖాధికారి శ్రీ కంపా సుబ్బారావుగారు 100 రూ.లు చొ॥న వసూలు చేయుచున్న విధానాన్ని, దానిని యు.టి.యఫ్. వ్యతిరేకించిన వివరాలను తెలియజేసారు. ఇంకా వివిధ మండలాల నుండి వచ్చిన బాధ్యులు తమ శాఖల రిపోర్టులను యిచ్చారు.

జిల్లాశాఖల నిర్మాణం 1999

కరీంనగర్ జిల్లా

28.2.99న పి. రాజ్‌మౌళి గారి అధ్యక్షతన, కరీంనగర్‌లో నూతన కౌన్సిల్ సమావేశం జరిగినది. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి, కార్యదర్శి శ్రీ కె. భద్రయ్య హాజరైరి. గత సం॥ నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించిరి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి గారు రాష్ట్ర సంఘ కార్యక్రమాలను గూర్చి వివరించారు. తదుపరి కె. భద్రయ్య గారి నిర్వాహణలో జిల్లా నూతన కమిటీ నిర్మాణం జరిగినది.

అ : శ్రీ సిహెచ్. ప్రతాప్‌రావు; స.అ. : జి. అశోక్; ప్ర.కా. : రఘుకిశోర్; కా : శ్రీమతి నరేంద్రకుమార్, పి. వెంకట్, టి. వెంకటాద్రి, హబీబుద్దీన్, జి. తిరపతయ్య, కె. నాగభూషణాచారి, యం. సుధాకర్‌రెడ్డి, యం. తిరుపతిరెడ్డి, ఎ. వెంకటరమణ, డి. రాజమౌళి, సి. రామరాజు; కో : పి. నరసింహాస్వామి; ఆడిట్‌కమిటి : పి. రాజ్‌మౌళి (కన్వీనర్); యస్. వేణుశ్రీ, టి. రమేష్‌కుమార్ రాష్ట్ర కౌన్సిలర్‌గా; శ్రీ బహద్దూర్, రఘుకిశోర్.

నిజామాబాద్ జిల్లా

99 మార్చి 7వ తేదీని, నిజామాబాద్ జిల్లా నూతన కౌన్సిల్‌లో శ్రీ సిహెచ్. కిషన్‌గారి అధ్యక్షతన నిజామాబాద్‌లో జరిగినది. గత సం॥లో జరిగిన సంఘ కార్యక్రమాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకొనిరి. అనంతరం, పద్మాకరరావుగారి నిర్వాహణలో నూతన కమిటీని ఎన్నుకొనిరి.

అ : శ్రీ పి. వెంకటయ్య; స.అ. : సిహెచ్. కిషన్; ప్ర.కా. : ఎ. మురళీకృష్ణ; కో. : యస్. దత్తాత్రిరావు; కా : ఎ. పోశెట్టి, వి. పద్మాకరరావు, బి. బాలయ్య, టి. కేశవకుమార్, సి. సూర్యనారాయణ, గులామ్ రసూల్, ప్రభాకర్, శ్రీమతి బి. అరుణకుమారి.

జిల్లా ఆడిట్ కమిటి : శ్రీ బి. గోపాల్‌రెడ్డి, కె. బాబు

కోఆప్షన్ మెంబర్‌గా శ్రీ గులామ్‌నబీ ముస్తాబ్‌ను తీసుకొనిరి.

వరంగల్ జిల్లా

ఫిబ్రవరి 28వ తేదీన, టి. ప్రభాకర్‌గారి అధ్యక్షతన, వరంగల్ జిల్లా శాఖ నూతన కౌన్సిల్ సమావేశం జరిగినది. గత సం॥ కార్యక్రమాలు సమీక్షించుకొని నిర్ణయాలు తీసుకొనిరి. రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఎన్. నారాయణగారు, రాష్ట్ర సంఘం చేసిన వివిధ కార్యక్రమాలను గూర్చి వివరించిరి. తదుపరి, రాష్ట్ర కార్యదర్శి శ్రీ కె. భద్రయ్య గారి ఆధ్వర్యమున నూతన కమిటి ఎన్నుకొనబడినది.

అ : టి. ప్రభాకర్; స.అ. : యస్. సోమయ్య; ప్ర.కా. : టి. సీతారామ్; కా : ఎ. సుందరయ్య, ఎ. శ్రీనివాస్, వి. నందయ్య, కె. కృష్ణమూర్తి, యండి. అబ్దుల్ ఖదీర్, జి. వీరయ్య, యస్. సదానందం, కె. రాజిరెడ్డి, జి. రవికిరణ్‌రెడ్డి, యండి. రియాజ్, శ్రీమతి పి.జె. మృణాళిని.

అనంతపూర్ జిల్లా

99 ఫిబ్రవరి 28వ తేదీన, అనంతపూర్ జిల్లాశాఖ నిర్మాణం శ్రీ ఇమామ్ సాహెబ్ గారి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశమునకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామిరెడ్డిగారు, రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఆనందనాయుడు గారు హాజరైరి. గత సం॥ జరిగిన కార్యక్రమాలపై సమీక్షించి నిర్ణయాలు తీసుకొనిరి. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామిరెడ్డి రాష్ట్ర సంఘం నిర్వహించిన వివిధ అంశాలను గూర్చి వివరించిరి. రాష్ట్ర కార్యదర్శి ఆనందనాయుడు ప్రసంగించిన అనంతరం నూతన కమిటీ ఎన్నికలు జరిగినవి.

అ : టి. ఇమాం సాహెబ్; స.అ. : వై. రంగారెడ్డి; ప్ర.కా. : ఎన్. శంకరనాయుడు; కో : బి. రామ సుంకయ్య; కా : సి.కె. నాగేంద్రబాబు, జె. రమేశ్, కె. షౌకత్ ఆలీకాన్, కె. జగన్నాథ్‌రావు, జి. లక్ష్మీనారాయణ, ఆర్. అశ్వర్థరెడ్డి, జి. పన్నె గౌడ్, జి. వెంకటేశ్, యల్. ఆదినారాయణ రెడ్డి, యస్. శివన్న, శ్రీమతి కమలమ్మ.

ఆడిట్ కమిటి : ఎ. గురుస్వామి, కె. కేశవనారాయణ, సి. రాంభూపాల్‌రెడ్డి.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు : శ్రీమతి ఎమ్. ప్రగతి, సి.ఆర్. నరసింహమూర్తి.

ప్రకాశం జిల్లా

99 జనవరి 30వ తేదీన ఒంగోల్‌లో శ్రీ వెంకటరావు అధ్యక్షతన నూతన కౌన్సిల్ సమావేశం జరిగినది. రాష్ట్ర అధ్యక్షులు రామిరెడ్డి గారు, కార్యదర్శి లక్ష్మీరెడ్డిగారు హాజరైరి. గత సం॥ కార్యక్రమాలను సమీక్షించుకొని, నిర్ణయాలు తీసుకొనిరి. రాష్ట్ర అధ్యక్షులు రామిరెడ్డిగారు ప్రసంగించుతు సభ్యత్వం పెంచుతున్నాం, కార్యకర్తలను తయారు చేసుకొనుచున్నాము. కాని, కార్యకర్తలలో సామాజిక స్పృహ తగ్గుతున్నది దీనిని సరిచేసుకొనవలెను అనిరి. డి. లక్ష్మీరెడ్డి గారి అధ్యక్షతన నూతన కమిటి నిర్మాణం జరిగినది.

జిల్లా కౌన్సిలర్ల కోఆప్షన్ : డి. లక్ష్మీరెడ్డి, యం. పానకలరావు, షేక్ షంషుద్దీన్, బి. నాగమణి, ఎన్. శారదమ్మ.

జిల్లా కార్యదర్శి వర్గం : అ : కె. వెంకటరావు; ప్ర.కా. : కె. ఆదినారాయణ; అ.అ. : జి. శేషయ్య; కో : ఆర్.వి. నారాయణ; కా : టి. నారాయణరావు, జి. రవీంద్రనాధరెడ్డి, ఎ. సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్, పి. లూకయ్య, డి. వెంకటేశ్వరరెడ్డి, బి. చెంచయ్య, ఒ.బి. వీరారెడ్డి, యం. వెంకటేశ్వరరెడ్డి, డి. లక్ష్మీరెడ్డి, సి. సత్యనారాయణ శర్మ, టి. రామ్మూర్తి, యన్. అనసూయమ్మ (మహిళా ప్రతినిధి), బి. సుబ్బారావు (ఎయిడెడ్ ప్రతినిధి).

రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు : ఎ. ఆదినారాయణ, కె. వెంకటరావు, మక్కెన కోటయ్య, కె. కృష్ణమూర్తి, జి.సి. బసిరెడ్డి, పి. నాగేశ్వరరావు, వి. మాలకొండారెడ్డి, బి.వి. రత్నం, షేక్ గౌస్ భాష, ఎ. తిరుమలేషు, యం. భాస్కరరెడ్డి, బి. నాగమణి.

ఆడిట్ కమిటి : షేక్ షంషుద్దీన్ (కన్వీనర్), ఎస్. అంజిరెడ్డి, యం. శ్రీనివాసరాజు.

